
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీసత్యసాయి
జిల్లా వార్తలు
బుధవారం 13 మార్చి 2024



ఇంటర్ పరీక్షకు 465 మంది గైర్హాజరు

కొత్తచెరువు, మార్చి 12: జిల్లావ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షకు 465 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐఓ సురేశ్‌బాబు ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరం ఫిజిక్స్-1, ఎకనామిక్స్-1 పరీక్షలు 12,557 మంది రాయాల్సి ఉండగా.. 465 మంది గైర్హాజరయ్యారన్నారు. దీంతో 12,102 మంది పరీక్షలు రాశారని ఆయన తెలిపారు.



కృష్ణాజలాల విడుదలలో ప్రభుత్వం ద్రోహం

అన్నదాతకు అన్యాయం!


- జిల్లా చెరువులను ఎండబెట్టిన వైనం
- గొల్లపల్లి రిజర్వాయర్‌నూ నింపని దుస్థితి
- వట్టిపోయిన మడకశిర ఉపకాలువ
- ఆయకట్టు రైతుకు కన్నీరు
- పక్క జిల్లాకు హంద్రీనీవా నీరు



వట్టిపోయిన మడకశిర ఉపకాలువ



చుక్క నీరు లేని కొటిపి చెరువు



నీరులేక పిచ్చిమొక్కలతో నిండిన మడకశిర ఉపకాలువ

'మేం రైతుల పక్షం. అధికారంలోకి వస్తే ఆయకట్టు చివరి ఎకరాకు కూడా నీరందిస్తామం'టూ ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా వైసీపీ అధినేత జగన్ ప్రగల్భాలు పలికారు. ఎన్నికల్లో గెలిచి, అధికారం చేపట్టారు. తొలినాటి నుంచి తమది రైతు ప్రభుత్వం అంటూ గొప్పలు చెబుతూనే ఉన్నారు. కరువు జిల్లా రైతును అన్నివిధాలా ఆదుకుంటామని ప్రతి సభలోనూ ప్రసంగాలిస్తున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా రైతు కడుపు కొడుతున్నారు. జిల్లాలో చెరువులు, కాలువలను ఎండబెట్టి, హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణాజలాలను పక్క జిల్లాకు తరలిస్తున్నారు. ఆయకట్టును ఎండబెట్టి, అన్నదాతకు కన్నీరు మిగులుస్తున్నారు. కనీసం గొల్లపల్లి రిజర్వాయర్‌ను కూడా నింపలేదు. దానికి అనుబంధంగా ఉన్న మడకశిర ఉప కాలువకు చుక్క నీరివ్వకపోవడంతో వట్టిపోయింది. దీంతో వేల ఎకరాల ఆయకట్టు భూములు వట్టిపోయి, నెర్రెలు చీలాయి. - హిందూపురం



కుప్పం కోసం చెరువులు ఎండబెట్టారా?


చంద్రబాబు సొంత నియోజకవర్గానికి తాము హంద్రీనీవా నీరు ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడానికి వైసీపీ పాలకులు పథకం పన్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా గొల్లపల్లి రిజర్వాయర్‌కు చేరాల్సిన నీటిని కుప్పానికి మళ్లించారు. చెన్నేకొత్తపల్లి నుంచి కుప్పం, 200 కి.మీ.పైగా ఉండటంతో అధిక శాతం నీరు కాలువలో ఆవిరై, వృథా అయింది. గతనెల 26న ముఖ్యమంత్రి జగన్ హంద్రీనీవా నీటిని కుప్పానికి తీసుకొచ్చామని గొప్పలు చెప్పి అక్కడ నీటిని వదిలారు. మరుసటి రోజే కాలువలో నీటి తేమ లేదు. దీంతో ఉత్తుత్తి ప్రారంభమనీ, అంతా గ్రాఫిక్స్ అంటూ జనం నవ్వుకున్నారు.



ఎండిపోయిన హారేసముద్రం చెరువు


పంటలు ఎండిపోతున్నాయి

గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి చెరువులకు నీరు వదలకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. టీడీపీ హయాంలో వేసవిలో కూడా చెరువులు కళకళలాడేవి. వైసీపీ పాలనలో ఒక్క ఏడాది కూడా హంద్రీనీవా ద్వారా చెరువులను నింపలేదు. దేవుడి పుణ్యమా అంటూ గత రెండేళ్ల వరదలతో చెరువులు నిండాయి. ఈసారి వర్షపాతం అంతంతమాత్రమే కావడంతో చెరువులన్నీ ఎండిపోయాయి. దీంతో హంద్రీనీవాను నమ్ముకుని పంటలు సాగుచేసి మోసపోయాం. బోరుబావుల్లో నీరు అడుగంటిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చెరువులు నింపాలి.
- జయప్ప, కొండాపురం, పెనుకొండ మండలం



కుప్పం ప్రజలను మభ్యపెట్టేందుకు...

సీఎం జగన్ మొత్తానికే మోసం చేశాడు. చంద్రబాబు నియోజకవర్గం కుప్పం ప్రజలను మభ్య పెట్టేందుకు హంద్రీనీవా ద్వారా నీరు తీసుకెళ్లేందుకు ప్రయత్నించి మూడు నియోజకవర్గాల పరిధిలోని చెరువులను ఎండబెట్టిన ఘనత వైసీపీ పాలకులకే దక్కింది. తెలుగుదేశం హయాంలో గొల్లపల్లి రిజర్వాయర్‌ను కేవలం 18 నెలల్లో నిర్మించి, కియ కార్ల పరిశ్రమ, హిందూపురం పట్టణానికి తాగునీరు అందించారు. పెనుకొండ నుంచి మడకశిర వరకు చెరువులకు నీరు అందించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 265 చెరువులకు నీటిని వదిలారు. వైసీపీ వచ్చాక పరిస్థితి తల్లకిందులైంది. ఆ చెరువులకు నీరు మాత్రం రాలేదు. గతేడాది వరుణదేవుడి పుణ్యమా అంటూ చెరువులకు వరదనీరు రాగా.. ఈసారి వర్షం అంతంత మాత్రమే కురవడంతో అవి వట్టిపోయాయి.



గొల్లపల్లి రిజర్వాయర్‌లో తగ్గిపోయిన నీటి మట్టం

అడుగంటిన గొల్లపల్లి రిజర్వాయర్

గొల్లపల్లి రిజర్వాయర్ నీటి సామర్థ్యం 1.6 టీఎంసీ. ఇక్కడి నుంచి హిందూపురం, కియ పరిశ్రమకు 0.6 టీఎంసీ ఇవ్వాలి. టీఎంసీ నీరు నవంబరు నెలలోనే చెరువులకు వదలాలి. ప్రస్తుతం గొల్లపల్లి రిజర్వాయర్‌లో 0.9 టీఎంసీ నీరు మాత్రమే నిల్వ ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇందులో 0.6 టీఎంసీ కియ, హిందూపురానికి వాడుకోవాల్సి ఉంది. ఇక మిగిలే 0.3 టీఎంసీల నీరు ఎక్కడికిస్తారో అర్థంకాని పరిస్థితి. ప్రస్తుతం ఎండలు మండిపోతుండడంతో ఈ నీరు ఇంకిపోయే అవకాశం ఉందని నీటి విభాగం అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఈ ఏడాది చెరువులు, కుంటల కింద ఉన్న ఆయకట్టు రైతులకు కన్నీరే మిగలనుంది. ఇప్పటికే సాగుచేసిన పంటలు ఎండిపోతున్నాయి.

మడకశిర ఉపకాలువకు నీరేదీ?

గొల్లపల్లి రిజర్వాయర్ మొదలుకుని పెనుకొండ, సోమందేపల్లి, హిందూపురం, లేపాక్షి, పరిగి మండలాల్లో సుమారు 265 చెరువులకు మడకశిర ఉపకాలువ ద్వారా హంద్రీనీవా నీరు అందించాల్సి ఉంది. ఈ చెరువుల కింద సుమారు 35వేల ఎకరాల ఆయకట్టు ఉంది. తెలుగుదేశం హయాంలో అక్టోబరు, నవంబరు నెలలకే చెరువులకు నీరు నింపేవారు. దీంతో వర్షాలు వచ్చినా, రాకపోయినా చెరువుల్లో జూన్, జూలై వరకు నీరు ఉండేది. 2022లో చెరువులకు నీరు వదిలినట్లే నటించినా చుక్క కూడా ఇవ్వలేదు. వరుణుడి కరుణతో మడకశిర, హిందూపురం, పెనుకొండ మండలాల్లో చెరువులు నిండాయి. గతేడాది అనుకున్న మేర వర్షపాతం నమోదు కాకపోవడంతో ఉన్న నీరు అక్టోబరు, నవంబరు మాసాలకే సరిపోయింది. హంద్రీనీవా నుంచి నీరు ఇస్తారని రైతులు ఆశగా ఎదురుచూశారు. జనవరిలో వదిలినట్లే వదిలి కాలువ తెగిందన్న సాకుతో నిలిపేశారు. దీంతో ఈ మూడు నియోజకవర్గాల్లో చెరువులు బీటలుబారాయి. 35వేల ఎకరాల దాకా ఆయకట్టు బంజరుగా మారింది.



రైతు బిడ్డ అని చెప్పుకుంటారు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాను రైతు బిడ్డననీ, రైతు కష్టం, నష్టం తెలుసని ప్రసంగాలిస్తుంటారు. వైసీపీ వచ్చాక ఐదేళ్లలో కొటిపి చెరువు ఎన్నిసార్లు నింపారో ఆ పార్టీ నాయకులే చెప్పాలి. తెలుగుదేశం హయాంలో మా చెరువులు కళకళలాడేవి. ఏడాది పొడవునా నీరుండేది. నేడు చెరువులోని చెట్లు సైతం ఎండిపోతున్నాయి. పశువులకు తాగడానికి నీరుకూడా లేని దుస్థితి. చెరువుకింద పంట సాగుచేసే రైతులు ఆలోచించాల్సి వస్తోంది.
- కృష్ణారెడ్డి, కొటిపి, హిందూపురం మండలం

ఎవరికి వారే..!

కదిరి వైసీపీలో తారస్థాయికి అసమ్మతి

- ఇన్‌చార్జి, ఎమ్మెల్యే మధ్య కుదరని సయోధ్య
- పనిచేయని మంత్రి మంత్రాంగం
- అయోమయంలో కార్యకర్తలు

కదిరి, మార్చి 12: నియోజకవర్గ వైసీపీలో అసమ్మతి తారస్థాయికి చేరింది. ఇప్పటికే ఎమ్మెల్యే సిద్దారెడ్డి, ఇన్‌చార్జ్ మగ్బూల్ చెరోదారిలో నడుస్తున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దిశానిర్దేశంతో ఒక్కటైనట్లు కనిపిస్తున్నా.. ఆ నాయకుల మధ్య విభేదాలు సమసిపోలేదని ఆ పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. తారస్థాయికి చేరినట్లు సమాచారం. నాయకుల మధ్య సయోధ్య కుదర్చలేక మంత్రి ఇబ్బందులు పడుతున్నట్లు చర్చ సాగుతోంది. ఇన్‌చార్జి మాట వినే నాయకులే కరువైనట్లు సమాచారం. నాయకులు సొంత అజెండా అమలు చేయాలని పట్టుబడుతున్నట్లు తెలిసింది. చివరకు ఏ మండలానికి ప్రచారానికి వెళ్లాలన్న విషయం కూడా నాయకుల మధ్య విభేదాలను తెచ్చి పెడుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. పార్టీలో సర్దుబాట్లకే సమయం సరిపోతోందని కార్యకర్తలు వాపోతున్నారు. టీడీపీ ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతోందని వారు.. నాయకత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారు. నాయకుల మధ్య విభేదాల నేపథ్యంలో ప్రచారానికి దూరంగా ఉంటున్నారు దీంతో కార్యకర్తలు అయోమయంలో పడిపోతున్నారు. ఎమ్మెల్యే ప్రచారానికి దూరంగా ఉండడం, నాయకుల మధ్య విభేదాలు ఉండడంతో కార్యకర్తల్లో నిరుత్సాహం నిండుకున్నట్లు తెలుస్తోంది.



కుదరని సయోధ్య

వైసీపీ నాయకుల మధ్య సయోధ్య కుదరనట్లు సమాచారం. నియోజకవర్గ ఇన్‌చార్జి మగ్బూల్ ఇప్పటికే ప్రచారం మొదలుపెట్టారు. అయనకు అండగా ఉంటామని చెప్పిన నాయకులు పూల శ్రీనివాసరెడ్డితోపాటు ఇస్మాయిల్, వజ్ర భాస్కర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి మరికొంతమంది దూరంగా ఉంటున్నట్లు సమాచారం. మొదట్లో ఉన్న ఉత్సాహం వారిలో ఇప్పుడు కనిపించట్లేదని వైసీపీ కార్యకర్తలే చెబుతున్నారు. ఇటీవల తనకల్లులో నిర్వహించిన మంత్రి సభలో వజ్ర భాస్కర్‌రెడ్డి, ఇస్మాయిల్ స్టేజి మీదనే తీవ్రస్థాయిలో వాగ్వాదానికి దిగారు. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య విభేదాలు తారస్థాయికి చేరినట్లు తెలిసింది. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడ్డ తమకు లేని స్థానం వజ్ర భాస్కర్‌రెడ్డికి ఎక్కడిదని ఇస్మాయిల్ మండిపడినట్లు తెలిసింది. ఇన్‌చార్జి మగ్బూల్ వ్యవహారశైలితో కూడా కొందరు నాయకులు దూరంగా ఉంటున్నట్లు సమాచారం. మున్సిపాలిటీలోని సైదాపురం, గాండ్లపెంట మండలాల్లో ప్రచారాలకు వీరు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది.

మంత్రి చెప్పినా..

ఎమ్మెల్యేగా సిద్దారెడ్డి ఉండగానే వైసీపీ అధిష్ఠానం కదిరి నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా మగ్బూల్‌ను నియమించింది. దీంతో ఇరువురి మధ్య విభేదాలు తలెత్తాయి. అవి తారస్థాయికి చేరాయి. చివరకు మంత్రి పెద్దిరెడ్డి చెప్పినా ఎమ్మెల్యే ఖాతరు చేయలేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పలుమార్లు కదిరికి వచ్చి కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. అయన మంత్రాంగం కూడా ఫలించలేదు. మొదట్లో కదిరిపై పెద్దిరెడ్డి పెత్తనం ఏంటని ప్రశ్నించారు. ఆ తరువాత ఎమ్మెల్యే వర్గీయులను భయపెట్టారు. దానికి కూడా కొంతమంది వెరవలేదు. ఎమ్మెల్యేతోపాటు ఆయన వర్గీయులు, పలువురు ప్రజాప్రతినిధులు ఇప్పటికీ దూరంగానే ఉన్నారు. ఆసరా సభలప్పుడు అది మంత్రికి బోధపడినట్టు తెలిసింది. ఇప్పటికీ నియోజవర్గంలో నల్లచెరువు, నంబులపూలకుంట ఎంపీపీలు దూరంగా ఉన్నారు. వీరితో పాటు మరికొంతమంది ప్రజాప్రతినిధులు దూరంగా ఉన్నారు. మంత్రి ఉపదేశం ఫలించలేదని పలువురు చెబుతున్నారు.

శ్రేణుల్లో అయోమయం

నాయకుల మధ్య తీవ్ర విభేదాలతో వైసీపీ కార్యకర్తలు అయోమయంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఏ వర్గానికి మద్దతు ఇవ్వాలో తెలియని అయోమయ స్థితిలో ఉన్నట్లు చర్చ సాగుతోంది. ఏ నాయకుడు ఎప్పుడు, ఏ వర్గంలో ఉంటాడో కూడా తెలియడం లేదని కార్యకర్తలు వాపోతున్నారు. దీంతో వారు ఎవరికి మద్దతివ్వాలో, ఎవరి వెంట నడవాలో అర్థంకాక మిన్నకుండిపోతున్నారు.







వైభవంగా హెంజేరు సిద్దేశ్వరుడి

చిన్నరథోత్సవం

మడకశిరటౌన్, మార్చి 12: ప్రసిద్ధి చెందిన అమరాపురం మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్దేశ్వరస్వామి చిన్నరథోత్సవం వైభవంగా నిర్వహించారు. సిద్దేశ్వరస్వామికి ఉదయం నుంచి అర్చనలు, విశేష పూజలు చేశారు. చిన్న రథోత్సవంపై హెంజేరు సిద్దేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, పురవీధుల్లో ఊరేగించారు. హేమావతి గ్రామం శివనామస్మరణతో మార్మోగింది. బుధవారం బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఖాద్రీశుడి హుండీ

ఆదాయం రూ.78.71 లక్షలు

కదిరి, మార్చి 12: పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. 60రోజులకుగాను రూ.78.71 లక్షల ఆదాయం వచ్చింది. విదేశీ కరెన్సీ అమెరికా డాలర్లు 928, యూరో కరెన్సీ రూ.50, భూటాన్ 41, నేపాల్ 5, దక్షిణాఫ్రికా 10, కెనడా 20, శ్రీలంక 1500, ఇండోనేషియా 100 తేలింది. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, దేవదాయ అధికారి నరసింహరాజు, కెనరా బ్యాంకు మేనేజర్ మధుసూదన్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు.



హుండీని లెక్కిస్తున్న దృశ్యం

నేడు సమన్వయ సమావేశం

శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో బుధవారం ఆలయ కల్యాణ మండపంలో వివిధ శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆర్డీఓ వంశీకృష్ణ ఆధ్వర్యంలో సమావేశం ఉంటుందన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

రెండు గంటలపాటు ప్రయాణికులకు తిప్పలు

పెనుకొండ రూరల్/మడకశిర రూరల్, మార్చి 12: ఆర్టీసీ మడకశిర డిపోకి చెందిన బస్సు మంగళవారం మొరాయించింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 8 గంటలకు మడకశిర నుంచి పుట్టపర్తికి బస్సు బయల్దేరింది. పెనుకొండ మండలంలోని మావటూరు గ్రామం వద్దకు రాగానే ఇంజిన్‌లో సమస్య తలెత్తి, మొరాయించింది. జిల్లా కేంద్రానికి వివిధ ఆఫీసు పనులు, సమావేశాల నిమిత్తం పలువురు బస్సెక్కారు. మార్గమధ్యలో బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు, పాఠశాలలకు వేళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంగన్‌వాడీ కార్యకర్తల యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ.. తమకు జిల్లా కేంద్రంలో సమావేశం ఉందనీ, సకాలంలో హాజరుకావాల్సి ఉందన్నారు. బస్సు మొరాయించడంతో సకాలంలో వెళ్లలేకపోయానన్నారు. బస్సు మొరాయించడంతో వెంటనే అధికారులు ప్రత్యామ్నాయ బస్సయినా ఏర్పాటు చేయాలనీ, లేదంటే టిక్కెట్ డబ్బులైనా తిరిగివ్వాలి. రెండుగంటల తరువాత మరో బస్సు వచ్చింది. ఆ బస్సు ఎక్కి ప్రయాణికులు వెళ్లిపోయారు.



నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి.. ధర్మవరంలో పోలీసు కవాతు

ధర్మవరం, మార్చి 12: ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి పేర్కొన్నారు. కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పట్టణంలో మంగళవారం డీఐజీ, ఎస్పీ మాధవరెడ్డి, డీఎస్పీ, సీఐలు, సిబ్బంది మంగళవారం కవాతు నిర్వహించారు. డీఐజీ మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు సమన్వయంతో ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.





ధర్మవరంలో పోలీసు కవాతు నిర్వహిస్తున్న డీఐజీ, ఎస్పీ, డీఎస్పీ, సిబ్బంది



	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.33 బుధవారం (సాయంత్రం)	5.07 గురువారం (ఉదయం)
కదిరి	6.35 బుధవారం (సాయంత్రం)	5.07 గురువారం (ఉదయం)
ధర్మవరం	6.35 బుధవారం (సాయంత్రం)	5.11 గురువారం (ఉదయం)
హిందూపురం	6.33 బుధవారం (సాయంత్రం)	5.15 గురువారం (ఉదయం)
పెనుకొండ	6.31 బుధవారం (సాయంత్రం)	5.12 గురువారం (ఉదయం)

జాతీయ హాకీ పోటీలకు ఎంపిక


దేవకి, నందిని, భరణి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 12: జాతీయ మహిళా హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన దేవకి, నందిని, భరణి ఎంపికయ్యారు. బుధవారం నుంచి మహారాష్ట్రలోని పుణెలో నిర్వహించే ఈ పోటీల్లో వీరు పాల్గొంటారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

అనంతపురం కల్చరల్, మార్చి 12: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం డీఎం నాగభూపాల్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రయాణికులు సందేహాలు, ఫిర్యాదుల కోసం సా యం త్రం 4 నుంచి 5 గంటల మధ్య 08554 248553, 99592 25853 ను సంప్రదించాలన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.24 వేలు

అనంతపురంరూరల్, మార్చి 12: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.24 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.16 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 393 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

17న మూర్ఛవ్యాధి వైద్యశిబిరం

అనంతపురం కల్చరల్, మార్చి 12: స్థానిక జేవీవీ జిల్లా కార్యాలయంలో మూర్ఛవ్యాధి వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు జేవీవీ కన్వీనర్ రామకృష్ణ, నగరాధ్యక్షుడు రామిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరంలో విజయవాడకు చెందిన ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ శివన్నారాయణ వైద్యపరీక్షలు నిర్వహిస్తారని, అవసరమైన వారికి మందులు అందిస్తారన్నారు. బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తండ్రి దాడిలో కొడుకు మృతి

● మద్యం తాగి గొడవ చేస్తున్నాడని ఆగ్రహం


మురళి మృతదేహం

గుంతకల్లుటౌన్, మార్చి12: రోజూ రాత్రి మద్యం తాగి ఇంటికి వస్తున్న కొడుకు ప్రవర్తనపై విసుగెత్తిన తండ్రి క్షణికావేశంలో కొడుకును కడతేర్చారు. గుంతకల్లు రూరల్ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని పాతగుంతకల్లు నాగప్ప కట్ట కాలనీలో బోనగల మురళి(28) బేల్దారి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడన్నారు. మురళి రోజూ మద్యం తాగి తల్లిదండ్రులతో గొడవపడేడు. సోమవారం రాత్రి మురళి మద్యం సేవించి తండ్రి మునిస్వామితో గొడవపడ్డాడు. క్షణికావేశంలో మునిస్వామి బండలు తుడిసే కట్టెతో మురళి తలమీద బాదాడు. గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందిన అనంతరం మురళి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం వేకువజామున మురళిని నిద్రలేపగా అతడు లేవకపోవడంతో అతన్ని చికిత్స నిమిత్తం తిరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడు మురళికి కొనకొండ్లకు చెందిన గంగోత్రితో మూడేళ్ల క్రితం వివాహమైంది. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

దళితులకు దగా


టీడీపీ హయాంలో అందజేసిన పట్టా పాస్‌బుక్

● నిధులు లేక ఆగిపోయిన భూమి కొనుగోలు పథకం
● ఎస్సీలకు వైసీపీ ప్రభుత్వం మొండిచెయ్యి
● ఐదేళ్లలో ఎకరం భూమీ ఇవ్వని వైనం ● టీడీపీ హయాంలో రూ.12 కోట్లతో 158 మందికి భూపంపిణీ


టీడీపీ హయాంలో పంపిణీ చేసిన సాగు భూమి

విడపనకల్లు, మార్చి 12: వైసీపీ పాలనలో ఎస్సీలకు మొండిచెయ్యి చూపారు. భూమిలేని పేదలు రైతులుగా మారే అవకాశం లేక కూలీలుగానే మిగిలిపోయారు. భూపంపిణీ చేస్తారని ఎదురు చూసిన దళితులు దగా పడినట్లయ్యింది. ఎస్సీల అభ్యున్నతి కోసం టీడీపీ ప్రభుత్వం భూమి కొనుగోలు పథకాన్ని(ఎల్‌పీఎస్) అమలు చేసింది. రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టు కింద ఉరవకొండ నియోజవర్గాన్ని ఎంపిక చేసింది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరు పేద ఎస్సీలకు 2.5 ఎకరాలు నుంచి 3ఎకరాలు సాగు భూమిని కొని ఇచ్చే పథకం ఇది. 75శాతం సబ్సిడీతో భూములను ఎస్సీలకు అప్పగించి, వారిని రైతులుగా మార్చడమే ఈ పథకం ఉద్దేశం. మిగిలిన 25 శాతం మొత్తాన్ని ల బ్ధిదారులు ఐదు వాయిదాలలో ఐదేళ్లలో చెల్లించాల్సి ఉంటుంది. కేంద్రం నిధులు 60శాతం, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ నిధులు 40శాతం కలిపి ఎస్సీలకు భూమిని కొనుగోలు చేసి ఇచ్చేవారు. 2018లో అప్పటి ప్రభుత్వం విడపనకల్లు మండలంలోని వివిధ గ్రామాల ఎస్సీ రైతులకు 158 మందికి ఒక్కొక్కరికి 2.5 ఎకరాల ప్రకారం దాదాపుగా 400 ఎకరాలు భూమిని అందజేసి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ. 12 కోట్ల ఖర్చు చేశారు. మొదటి విడత కింద అర్హులైన రైతులకు భూ పంపిణీ చేసింది. రెండో విడతలో భాగంగా రూ. 22 కోట్ల ఖర్చుతో దాదాపుగా 700 ఎకరాలుకు పైగా కొనుగోలు చేసి 230 మందికి పంపిణీ చేసేందుకు పరిపాలన అనుమతులు కూడా పొందారు. అప్పట్లో ఎన్నికల కోడ్ రావటంతో లబ్ధి దారుల ఎంపిక అలాగే నిలిచి పోయింది. మరో రూ. 40 కోట్లకు పైగా ప్రతి పాదనలతో 800 మందిని నియోజక వర్గంలో ఎస్సీలను ఎంపిక చేసి మూడవ విడతలోను 15వందల ఎకరాలకు పైగా పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఎస్సీ కార్పొరేషన్‌లో నిధులు ఉండి ఉంటే ఇప్పటికి ఉరవకొండ నియోజక వర్గంలో దాదాపుగా రెండు వేల మందికి పైగా ఎస్సీలకు సాగు భూమి అందేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్పొరేషన్ నిధులు ఖాళీ అయ్యి, లబ్ధిదారులుకు నిరాశే మిగిలింది. రెండవ విడతలో లబ్ధిదారుల ఎంపిక, పరిపాలన అనుమతులు కూడా పూర్తయినా భూ పంపిణీపై వైసీపీ నా యకులు దృష్టి పెట్టలేదు. ఎస్సీ కార్పొరేషన్‌లో లేవంటూ అధికారులూ దీనిపై దృష్టి పెట్టలేదు. మండలంలోని కొంత మంది వైసీపీ నాయకులు, ఎస్సీలకు భూ పంపిణీ చేస్తామంటూ మాయ మాటలు చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ. 40వేలు నుంచి రూ.50 వేలు వసూళ్లు చేసి నిలువునా మోసం చేస్తున్నారు. అమాయకులైన ఎస్సీలతో అందిన కాడికి దండుకోవటానికి కొంత మంది దళారులు తమ ఇళ్లకు పిలిపించుకొని వేలకు వేలు వసూలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఎస్సీ కార్పొరేషన్ నిధులు మొత్తం ఇతర అవసరాలకు మళ్లించటంతో జిల్లాలో భూ పంపిణీ నిలిచిపోయింది. ఫలితంగా ఎస్సీల అభివృద్ధి ఆగిపోయింది. వైసీపీ పాలనలో భూ పంపిణీ చేయక పోగా 2018లో భూమిని తీసుకున్న ఎస్సీ రైతులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సొమ్ము చెల్లించాలనీ, లేనిపక్షంలో ఇచ్చిన భూములను వెనక్కి తీసుకుంటామని నోటీసులు జారీ చేశారు. భూపంపిణీ చేయకపోగా ఉన్న భూములను లాగేసుకుంటామని హెచ్చరికలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాగుభూమి ఇచ్చింది టీడీపీ ప్రభుత్వమే : గంగన్న, ఎస్సీ రైతు, పాల్తూరు



మా కుటుంబానికి 2018లో టీడీపీ ప్రభుత్వంలో రెండున్నార ఎకరాలు సాగు భూమిని కొని మా పేరున రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. దాదాపుగా రూ. 8 లక్షలు విలువ చేసే భూమిని మాకు అందించి ఆర్థికంగా ఎదిగేందుకు అప్పటి ప్రభుత్వం మాకు భూ పంపిణీ చేసింది. ప్రభుత్వం మారిన తరువాత ఏ దళితుడికీ సెంటు భూమిని కూడా కొని ఇవ్వ లేదు. దళితులు కూలీలుగానే మిగిలిపోయారు.

పయ్యావుల కేశవ్ చొరవతోనే.. : మారుతమ్మ, రైతు, విడపనకల్లు



నాకు రెండు ఎకరాల భూమిని ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ చొరవతో అప్పటి ప్రభుత్వం అందించింది. సాగు భూములను వివిధ వర్గాల రైతులతో కొనుగోలు చేసింది. 5 సంవత్సరాలుగా భూమిని సాగు చేసుకుని ఆర్థికంగా కొంత ముందుకు వెళ్తూఉన్నాము. మా పేరున సాగు భూమి ఉండటంతో సమాజంలోను మాకు కొంత గౌరవంగా ఉంది.

రెండో విడతలో ఎంపికైనా భూమి ఇవ్వలేదు : భవాని, విడపనకల్లు



ఎస్సీలకు సాగు భూమలను కొని ఇచ్చే పథకాన్ని అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. మొదటి విడతలో కొంత మందికి ఎస్సీలకు భూ పంపిణీ చేశారు. రెండో విడతలోను భూమి పంపి ణీ చేయాలని దాదాపుగా 230 మందిని ఎంపిక చేసి లాటరీ తీశారు. ప్రభుత్వం మారడంతో మాకు భూపంపిణీ నిలిపి వేశారు. 5ఏళ్లుగా ఎదురు చూస్తున్నా భూ పంపిణీ జరపలేదు.

ఐదేళ్లుగా ఎదురు చూస్తున్నాం : ఓబుళమ్మ, విడపనకల్లు



ఐదేళ్ల ఎస్సీలకు ఒక్క ఎకరం భూమిని కొని ఇవ్వక పోగా కార్పొరేషన్‌లో ఉన్న నిధులు ఖాళీ చేశారు. రెండో విడత భూ పంపిణీ జరుగుతుంది అనుకునే సమయంలో వైసీపీ ప్రభుత్వం దళితులను నిలువునా మోసం చూసింది. రెండో విడతలో మా పేర్లను ఎంపిక చేశారు కానీ ఇప్పటి వరకూ ఎస్సీ కార్పొరేషన్ నుంచి భూమిని కొనుగోలు చేసి ఇచ్చిన పాపాన పోలేదు.

వందేభారత్ రైలుకు ఘన స్వాగతం

గుంతకల్లు, మార్చి12: జిల్లాకు చేరిన కలబురిగి- బెంగళూరు వందే భారత్ రైలుకు అధికారులు ఘన స్వాగతం పలికారు. మంగళవారం మధ్యాహ్నం ఒకటిన్నరకు గుంతకల్లు చేరగా, డివిజనల్ అధికారులు ఘన స్వాగతం పలికారు. ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ ద్వారా రైలును ప్రారంభించగా గుంతకల్లు డీఆర్‌ఎం మనీశ్ అగర్వాల్ ఆధ్వర్యంలో రాయచూరులోనూ, ఏడీఆర్‌ఎం సుధాకర్ ఆధ్వర్యంలో గుంతకల్లులోనూ వందే భారత్ రైలుకు స్వాగత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో డిజిటల్ స్ర్కీన్లను ఏర్పాటుచేసి ప్రధానమంత్రి రైల్వే ప్రాజెక్టులను, వందే భారత్ రైళ్లను ప్రారంభించిన వర్చువల్ కార్యక్రమాన్ని ప్రదర్శించారు. ఇన్ని ప్రాజెక్టులు, రైళ్ల ప్రారంభం, మరికొన్ని ప్రాజెక్టులను శంకుస్థాపన చేయడం చారిత్రకమని ఏడీఆర్‌ఎం సుధాకర్ పేర్కొన్నారు. మధ్యాహ్నం కలబురగి-బెంగళూరు వందేభారత్ రైలు 1వ నెం. ప్లాట్‌ఫారం పైకి రావడంతో బీజేపీ నాయకులు, రైల్వే అధికారులు, సిబ్బంది పూల వర్షం కురిపిస్తూ ఆహ్వానం పలికారు. అనంతరం డీపీఓ యాప్రిల్ అరోరా పచ్చజెండాను ఊపి రైలును ముందు కు పంపారు. కార్యక్రమానికి నోడల్ ఆఫీసరుగా సీనియర్ డీఎస్‌టీఈ వైపీ సింగ్, కో-ఆర్డినేటరుగా ఆర్ రామస్వామి నాయక్ వ్యవహరించారు. మండలంలోని నక్కనదొడ్డి గ్రామం వద్ద నిర్మించిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) ఇంధన గిడ్డంగులను మంగళవారం లాంఛనంగా జాతికి అంకితం చేశారు. కార్యక్రమంలో ఐఓసీ చీఫ్ డిపో మేనేజరు కే నవీన్ కుమార్, సీనియర్ డీఈఎన్ (కోర్డినేషన్) అక్కి రెడ్డి, ఏఓఎం అమ్రిత్ లాల్ మీనా, చీఫ్ వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ మీనా కుమారి, ఏఓడబ్ల్యూ శివదాస్, సిబ్బంది కేజే సుబ్రహ్మణ్యం, షాజీద్ అహ్మద్, సర్పంచు డీ వరలక్ష్మి, టీడీపీ నాయకుడు బొజ్జేనాయక్ పాల్గొన్నారు.


వందే భారత్ రైలుకు పచ్చజెండా ఊపుతున్న డీపీఓ యాప్రిల్ అరోరా

ప్రయాణికులకు అనుగుణంగా రైల్వే సేవలు

● రైల్వే డీఎంఈ అజాముద్దీన్
● పెనుకొండలో గూడ్స్ షెడ్డు ప్రారంభం

పెనుకొండ రూరల్, మార్చి 12 : భారతీయ రైల్వే ఆధునికీకరణలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ రైల్వే రగంలో ప్రయాణికులకు అనుగుణంగా విస్తృత సేవలు అందిస్తున్నారని రైల్వే సీనియర్ డీఎంఈ అజాముద్దీన్ కొనియాడారు. ఒకే దేశం, ఒకే రైల్వేస్టేషన్, ఒకే గూడ్స్ నినా దంతో ప్రధానిమోదీ గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ నుంచి రూ.85వేల కోట్ల అంచనాతో పలు రైల్వే ప్రాజెక్ట్ పనులు, పది వందే భారత్ రైళ్లను వర్చువల్ విధానంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పెనుకొండ రైల్వే స్టేషన్‌లో రైల్వే అధికారుల ఆధ్వర్యంలో పలువురు హాజరై ప్రధాని ప్రసంగాన్ని వీసీలో వీక్షించారు. అనంతరం స్థానిక రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రైల్వే డీఎంఈ మాట్లాడుతూ.... ప్రధాని మోదీ హయాంలో రైల్వే రంగం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. బెంగళూరు డివిజన్‌లో వేలాది మందికి ప్రయోజనం చేకూర్చే రెండు వందే భారత్ రైళ్లను ప్రారంభించారన్నారు. వీటిలో ఒకటి జిల్లా నుంచి ప్రయాణించడం హర్షణీయమన్నారు. 2021-22లో 9100కియ కార్లు, 2022-23లో 20,300 కార్లను పెనుకొండ రైల్వే స్టేషన్ నుంచే ఇతర రాష్ట్రాలకు తరలించారని తెలిపారు. ఈ ఏడాదిలోనే 16,200 కియ కార్లు ఎగుమతి అయ్యాయన్నారు. అనంతరం గూడ్స్‌షెడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో పెనుకొండ రైల్వే స్టేషన్ అధికారులు, సిబ్బంది, బీజేపీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


పెనుకొండలో గూడ్స్ షెడ్డును ప్రారంభిస్తున్న రైల్వే అధికారులు

అధ్వానం


హంద్రీ నీవా కాలువలో తగ్గిన నీటి ప్రవాహం



● 22 టీఎంసీల నీరూ ఎత్తిపోయలేదు ● డ్యాంలో కనిష్ఠ మట్టానికి పడిపోయిన నీటి నిల్వ ● ఆగిపోనున్న పంపింగ్

గుంతకల్లు, మార్చి12: హంద్రీనీవాలో ఐదేళ్లతో పోలిస్తే ఈసారి మరీ అధ్వానంగా ఎత్తిపోతలు కొనసాగాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో చివరి సంవత్సరం అత్యంత దిగదుడుపుగా నీటి పంపింగ్ కార్యక్రమం జరిగింది. కనీసం 22 టీఎంసీలు కూడా నీటిని పారించలేకపోయారు. 2020 సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ ఏటా హంద్రీనీవాలో ఎత్తిపోతల గ్రాఫ్ పడిపోతూ వచ్చింది. ఈ సంవత్సరం మరీ అధ్వానంగా కనీసం 22 టీఎంసీల స్థాయికి కూడా చేర్చలేకపోయారు. శ్రీశైలం డ్యాంలో నీటి నిల్వలు ఇక ఎత్తిపోతలు సాధ్యంకాని కనిష్ఠ స్థాయికి తగ్గిపోయాయి. రేపోమాపో హంద్రీనీవాలో పంపింగ్ నిలిచిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి.

కనిష్ఠ స్థాయికి ఎత్తిపోతలు

హంద్రీనీవాలో నీటి ఎత్తిపోతలు గత ఐదేళ్లలో ఎప్పుడూ లేనంత తక్కువ స్థాయిలో ఈ సంవత్సరం జరిగాయి. 2020-21 సంవత్సరం మొదలుకుని ఇప్పటిదాకా హంద్రీనీవాలో నీటి పారుదల ఏయేటికాయేడు తగ్గిస్తూ వచ్చారు. 2020-21 సీజన్‌లో హంద్రీనీవాలో నీరు గరిష్ఠంగా 40 టీఎంసీలు పారగా, 2021-22 సీజన్‌లో 25.56 టీఎంసీలకు, 2022-23 సంవత్సరంలో 23.7 టీఎంసీలకు, 2023-24 సంవత్సరంలో ఇప్పటిదాకా 21.13 టీఎంసీలు మాత్రమే పంపు చేయగలిగారు. ఈ లెక్కన 2020-21 సీజన్‌తో పోలిస్తే తర్వాతి సంవత్సరంలో దాదాపు 14.5 టీఎంసీలు, 2021-22 సంవత్సరంలో పోలిస్తే తదుపరి సంవత్సరం దాదాపు 2 టీఎంసీలు, 2022-23తో పోలిస్తే ప్రస్తుతం హంద్రీనీవాకు రెండు టీఎంసీల నీటి కోత ఏర్పడింది. మరో రోజులో నీటి ఎత్తిపోతలు నిలిచిపోనుండగా, కనీసం 22 టీఎంసీల మార్కును కూడా ఈసారి దాటే పరిస్థితితులు లేవు. కాగా ఇప్పటిదాకా హంద్రీనీవాకు లభించిన 21.13 టీఎంసీల నీటిలో అనంతపురం జిల్లాలో రాగులపాడు వద్ద ఉన్న 8వ పంపు హౌస్ నుంచి ఎగువకు 13.97 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. కర్నూలు జిల్లాకు 7 టీఎంసీలు లభించాయి.

తగ్గిపోయిన నీటి మట్టాలు

ఎత్తిపోతల పథకాలకు సంబంధించి హంద్రీనీవా డ్యాంలో నీటి నిల్వలు కనిష్ఠ స్థాయికి చేరుకోవడంతో హంద్రీనీవాలో పారుదల కార్యక్రమం చరమాంకానికి చేరింది. మల్యాల పంప్ హౌస్ వద్ద నీటిని తోడాలంటే డ్యాంలో కనీసం 835 అడుగుల స్థాయిలో నీరుండాలి. జనవరి మొదటి వారంలో డ్యాం మట్టం 835 అడుగుల కంటే తగ్గిపోవడంతో మల్యాల పంపులకు రెస్టిచ్చి, ప్రత్యామ్నాయంగా అందుబాటులో ఉన్న ముచ్చుమర్రి (కేసీ కెనాల్) ఎత్తిపోతల పథకం నుంచి హంద్రీ-నీవాకు తక్కువ మోతాదులో నీటిని అందించారు. అప్పటి నుంచి కేవలం రెండు పంపులను మాత్రమే వాడుతూ హంద్రీనీవాకు అరకొర నీటిని వదిలారు. అది కూడా తొలిదశ కింద ఉన్న కాలువ నుంచి చెరువులకు నీరు వెళ్లకుండా ఆపి, రెండవ దశ కింద ఉన్న జీడిపల్లి ఎగువ కాలువకు నీటిని తీసుకుపోయారు. ముచ్చుమర్రి పథకంలోని అన్ని పంపులకు నీరు అందాలంటే డ్యాంలో కనీసం 814 అడుగుల నీటి మట్టం ఉండాలి. కాగా మూడు రోజుల కిందట ఆ నంబరును దాటి మట్టం పడిపోయింది. దీంతో నీరు అందినకాడికి తక్కువ మోతాదులో పంపుచేస్తూ హంద్రీనీవాకు కూడా నీటిని అందించారు. ప్రస్తుతం 1వ నెంబరు పంపు హౌస్ వద్ద కేవలం ఒక్క పంపు మాత్రమే పనిచేస్తుండగా, దాదాపు 300 క్యూసెక్కుల నీరు ఎగువకు వస్తోంది. ప్రస్తుతం డ్యాంలో 812.4 అడుగుల నీటి నిల్వ ఉంది. ఈ మేరకు ఏక్షణమైనా ముచ్చుమర్రి పంపులు ఆగిపోనున్నాయి. ఇలా హంద్రీనీవా కాలువలో నీటి ఎత్తిపోతల విషయంగా ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ చూపకపోవడంతో మూడేళ్ల నుంచి ప్రతియేడూ నీటి ప్రవాహ స్థాయి దిగదుడుపుగా మారింది. తెలంగాణాపై పోరాటంలో ఏపీ ప్రభుత్వం మూడేళ్ల నుంచి చేతులు ఎత్తేయడంతో హంద్రీనీవా నుంచి లభించాల్సిన నీటి కోటా రాకుండా పోయింది.


వైవీబీ రాజేంద్ర ప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న చాంబర్ నాయకులు

నేడు కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

శింగనమల,మార్చి12: రాష్ట్రంలో సర్పంచుల సమస్యలపై చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం జిల్లాలో సర్పంచ్‌ల సమస్యలపై చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనడానికి జాతీయ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ చేరుకున్నారు. ప్రధాన కార్యదర్శులు బిర్రు ప్రతాప్‌రెడ్డి, కొత్తపు మునిరెడ్డిని అనంతపురంలో రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ కార్యకార్వాహక కార్యదర్శి డేగలకృష్ణమూర్తి, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల అధ్యక్షులు గోనుగుంట్ల భూషన్, జిల్లా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు వేలూరు రంగయ్య, ధనుంజయ్‌యాదవ్, సర్పంచులు తిరుపాలు, నిట్టూరు శివాజీ స్వాగతం పలికారు.

దాడి కేసు నమోదు

అనంతపురం క్రైం, మార్చి 12: నగరంలోని లక్ష్మీనగర్ పరిధిలోని పార్వతమ్మకాలనీలో ఓ మహిళపై వైసీపీ శ్రేణులు దాడి చేసిన ఘటనలో నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతపురం ఎమ్మెల్యే అనంతవెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో పార్వతమ్మ కాలనీలో సమస్యలపై నిలదీసిందని కొందరు వైసీపీ నాయకులు ఆమెపై దాడి చేశారు. పరస్పర ఫిర్యాదుల మేరకు వేర్వేరుగా కేసు నమోదు చేశారు. ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు దాడి చేసినట్లు లక్ష్మీదేవి ఫిర్యాదులో పేర్కొంది. ఒకరిని లక్ష్మీదేవి కాలితో తన్నిందనే ఫిర్యాదుపై ఆమెపై కేసు నమోదు చేశారు.

హత్య కేసు నిందితుడి అరెస్ట్

అనంతపురం క్రైం,మార్చి 12 : ఎస్కేయూ గెస్ట్ లెక్చరర్ మూర్తిరావ్ హత్య కేసులో నిందితుడైన అయన మేనల్లుడు ఆదిత్య శశాంక్‌ను వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. నగరంలోని ఎల్ఐసీ కాలనీకి చెందిన మూర్తిరావ్ ఈనెల 10వతేదీ రాత్రి జేఎన్టీయూ ఎదుట ఉన్న తన ఇంట్లో హత్యకు గురయ్యాడు. అతన్ని తన మేనల్లుడైన ఆదిత్యశశాంక్ హత్య చేశాడని వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మూర్తిరావ్‌కు ఐదుగురు అక్కచెల్లెళ్లు, ఒక సోదరుడు ఉన్నారు. మూర్తిరావు అందరితోనూ కలుపుగోలుగా ఉండేవాడు. పెద్ద అక్క నాగరత్నబాయి వాళ్లను మాత్రం సరిగా పట్టించుకునేవాడు కాదు. నాగరత్నబాయి కుమారుడైన ఆదిత్యశశాంక్ తిరుపతి ఎస్వీయూనివర్శిటీలో ఎంటెక్ చేస్తుండగా... ఓ సందర్భంలో తన మేనమామ మూర్తిరావ్ ఎంటెక్ వదిలేసి అనంతపురం రావాలని ఇక్కడ మంచి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడు. మేనమామ మాటలు నమ్మి ఆదిత్య శశాంక్ అనంతపురం వచ్చాడు. అతని ఉద్యోగం గురించి పట్టించుకోలేదు. అంతేకాకుండా తన మేనమామ వ్యవహార శైలి నచ్చలేదు. అంతా తాను చెప్పినట్లే జరగాలనీ, అంతా అతడి కంట్రోల్‌లో ఉండాలనే భావనతో అణగదొక్కుతున్నాడని మేనమామపై కసి పెంచుకున్నాడు. 10వతేదీ రాత్రి భార్య శోభతో కలిసి మూర్తిరావు జేఎన్‌టీయూ వద్దకు వెళ్లారు. ఇదే అదనుగా భావించి అక్కడ మాటువేసిన ఆదిత్య శశాంక్ కత్తితో పొడిచి విచక్షణారహితంగా హతమార్చాడు. మూర్తిరావు కుమార్తె వైష్ణవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు... వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప... సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం నిఘా వేశారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సర్కిల్ రోడ్డు సమీపంలో నిందితుడిని అరెస్ట్ చేశారు. అతడి నుంచి బైక్, హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపారు.

వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

అనంతపురం టౌన్, మార్చి 12: ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఉక్కపోతకు గురై వడదెబ్బ బారిన పడే అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ గౌతమి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వడదెబ్బపై అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వడదెబ్బ బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చలివేంద్రాలు ఏర్పాటు చేసి, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఉపాధిహామీ పనులు జరిగేచోట షేడ్‌నెట్స్, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. వడదెబ్బ తగలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు వివరించాలని ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమీక్షలో డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, ఎస్డీసీ ఆనంద్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, డ్వామాపీడీ వేణుగోపాల్‌రెడ్డి, డీఈఓ వరలక్ష్మితోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ధర్మవరంలో వరుస చోరీలు

భారీ ఎత్తున బంగారు, నగదు అపహరణ

కేసుల నమోదు తప్ప.. దర్యాప్తులో పురోగతి శూన్యం

బెంబేలెత్తుతున్న పట్టణ వాసులు



ధర్మవరం, మార్చి 12: వరుస చోరీలకు కేరాఫ్ అడ్రస్‌గా ధర్మవరం నిలుస్తోంది. ఎప్పుడు ఎక్కడ దొంగతనం జరిగిందన్న వార్త వినాల్సి వస్తుందోనన్న పరిస్థితులు నెలకొన్నాయి. అది కూడా పట్టపగలు ఇళ్లలో, దుకాణాల్లో చోరీలు జరుగుతుండటం పట్టణ వాసులను ఆందోళనకు గురిచేస్తోంది. ఐదు నెలల నుంచి ఇళ్లకు తాళాలు వేసి వెళ్లాలంటే కూడా భయపడుతున్న పరిస్థితులు ఉన్నాయి. కనీసం ఇంటిలో కొంత మేర నగదు, బంగారు నగలు ఉంచుకోవడానికి కూడా జనం ఆలోచించుకోవాల్సి వస్తోంది. విలువైన వస్తువులను, నగలను దొంగలు ఎత్తుకెళ్లడం, బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయడం పరిపాటిగా మారింది. అయితే కేసుల్లో సరైన పురోగతి లేదనే అభిప్రాయాన్ని పట్టణవాసులు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి దొంగతనాలకు పాల్పడుతున్న వారిని వెంటనే పట్టుకుని చర్యలు తీసుకుంటే తప్ప దొంగతనాలకు అడ్డుకట్ట పడదనే వాదన పట్టణంలో వినిపిస్తోంది.

● మహేశ్వరరెడ్డి ఇంటిలో 9 తులాలు, మురళీమోహన్ ఇంటిలో 40 తులాల బంగారాన్ని దుండగులు చోరీ చేశారు. రెండు రోజులక్రితం ప్రియాంకనగర్‌లో కొత్త ఇళ్ల నిర్మాణాలు జరిగే చోట అమర్చుకున్న మోటార్లను కూడా దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితులు అందరూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే పురోగతి మాత్రంశూన్యమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పుట్టపర్తి రహదారి పక్కన సెల్‌పాయింట్, వస్త్ర దుకాణాల్లో కూడా చొరబడి సెల్‌ఫోన్లు, నగదును ఎత్తుకెళ్లారు. మరోవైపు చోరీలు జరుగుతున్నాయని తెలిస్తే అద్దెలకు ఎవరు రారని ఇళ్ల యజమానులు లోలోపలే మధనపడుతూ పోలీసులకు ఫిర్యాదు చేయకుండా ఉన్న సంఘటనలు కూడా ఉన్నాయి.

● రైల్వేస్టేషన్ ఆవరణంలో ఆంజనేయులు అనే వ్యక్తి ద్విచక్రవాహనాన్ని పార్క్‌చేసి స్టేషన్‌లోకి వెళ్లి బయటకు వచ్చి చూడగా బైకు కనిపించకపోవడంతో టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా గ్రామీణ బ్యాంకు తదితర ప్రాంతాలలో ద్విచక్రవాహనాలు దొంగతనాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడంతో చోరీలు పెరిగిపోతున్నాయని పట్టణవాసులు అంటున్నారు.

● పోతుకుంట గ్రామంలో ఒకే రోజు వడ్డెకొండా, సుజాతమ్మ, శివ, లక్ష్మీదేవి, నాగభూషణం ఇళ్లను దుండగులు తాళాలు పగలకొట్టి చోరీలకు పాల్పడ్డారు. వడ్డెకొండా ఇంటిలో బీరువా పగలకొట్టి రూ.లక్ష నగదు, 9తులాల బంగారం చోరీ చేయగా సుజాతమ్మ ఇంటిలో రెండున్నర తులం బంగారం, కాలివెండి గొలుసులు, కొంతనగదు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా శివ, లక్ష్మీదేవి, నాగభూషణం ఇంటిలో కూడా చోరీ జరిగింది. దీంతో బాధితులు రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వీటితోపాటు బడన్నపల్లి, నేలకోట, బిల్వంపల్లి, సీతారాంపల్లి తదితర గ్రామాలలో వ్యవసాయ పరికరాలు చోరీకి గురైనట్లు బాధిత రైతులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన సంఘటనలూ ఉన్నాయి.



మొబైల్‌షాపులో సామగ్రిని చిందరవందర చేసిన దుండగులు

ప్రాథమిక వైద్యశాల తనిఖీ



మందులను పరిశీలిస్తున్న నాగేంద్రనాయక్

ఆంధ్రజ్యోతికి స్పందన

నల్లచెరువు, మార్చి 12: మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రనాయక్ మంగళవారం పరిశీలించారు. ప్రాథమిక వైద్యశాలలో మౌలిక సదుపాయాలు కరువు అన్న శీర్షిక ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆదివారం ప్రచురితమైంది. స్పందించిన డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రాథమిక వైద్యశాలను పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టకను, నాడు-నేడు పనుల పనితీరును పరిశీలించారు. ప్రతి వార్డును, మందుల స్టాక్ రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. ఫీల్డు సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీల పనితీరును ఆన్‌లైన్‌లో పరిశీలించారు. అనంతరం ల్యాబ్‌ను తనిఖీ చేసి వ్యాక్సిన్ నిల్వలపై ఆరాతీశారు. ఆయన వెంట వైద్యాధికారిణి కల్పన, సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి, పీహెచ్‌ఎన్ భారతి, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, కదిరి డిప్యూటీ హెల్త్ అసిస్టెంట్ ముస్తఫా, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఫార్మసిస్టు చిన్నయ్య, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి...



టీడీపీలో చేరినవారితో మాజీమంత్రి పల్లె

ఓబుళదేవరచెరువు, మార్చి 12: మండలంలోని ఇనగలూరు పంచాయతీ గొల్లపల్లి, బొడెద్దులవాండ్లపల్లికి చెందిన పది కుటుంబాలు మంగళవారం వైసీపీనుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. మాజీ మంత్రిపల్లె రఘునాథరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. గొల్లపల్లికి చెందిన ఇద్దే లక్ష్మీనారాయణ, ఇద్దే గంగిరెడ్డి, ఇద్దే ఆదినారాయణరెడ్డి కుటుంబాలతోపాటు పెయింటర్ వీరానాయుడు, చంద్రనాయక్, బొడెద్దులపల్లికి చెందిన నాగరాజు కుటుంబం టీడీపీలో చేరారు. వారికి పల్లె రఘునాథరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు నచ్చి వైసీపీని వీడి టీడీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, మైనార్టీ మండీజీ ఆర్ఫీఖాన్, పొగాకు జాకీర్ అహమ్మద్, పొగాకు షబ్బీర్, తుమ్మల మహబూబ్‌బాషా, మండల కార్యదర్శి పీట్ల సుధాకర్, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు బూదిలి ఓబులరెడ్డి, టీఎన్‌టీయూసీ నిజాం, షబ్బీర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొలాన్ని పరిశీలించిన 'పల్లె'

మండలంలోని ఇగనలూరు గ్రామానికి చెందిన టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు షబ్బీరీస్ నాయుడు పొలంలో రెండురోజులక్రితం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. రూ. మూడులక్షల వరకు నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మంగళవారం షబ్బీరీస్ నాయుడు పొలానికెళ్లి పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు డ్రిప్‌కు, కేబుల్ వైరుకు నిప్పు పెట్టడంతో దాదాపు రూ.మూడులక్షలు నష్టం జరిగిందని పల్లెకు ఆయన వివరించారు. అనంతరం ఫోన్‌ద్వారా తహసీల్దార్ ఖాజాబీతో మాజీ మంత్రి మాట్లాడారు. బాధితుడిని ప్రభుత్వం తరపున ఆదుకోవాలన్నారు. అనంతరం రామిరెడ్డిపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త రమణ తల్లి నరసమ్మ మృతి చెందడంతో కుటుంబాన్ని పరామర్శించి తనవంతుగా రూ. 5వేలు ఆర్థికసాయం అందించారు. ఆయనతోపాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు.

టీడీపీ కార్యకర్తకు తీవ్ర గాయాలు

ఓబుళదేవరచెరువు, మార్చి 12: మండలంలోని గాజుకుంటపల్లి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓడీసీ బీసీకాలనీకి చెందిన కాకా రామాంజి తీవ్రంగా గాయపడ్డారు. గొల్లపల్లిలో పార్టీ తరఫున కార్యక్రమానికి హాజరై ద్విచక్రవాహనంలో ఓడీసీకి వస్తుండగా గాజుకుంటపల్లివద్దకు రాగానే వాహనం అదుపు తప్పి కిందపడింది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. 108ద్వారా మండలకేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి బాధితుడిని ఫోన్‌ద్వారా పరామర్శించారు.

'ఉపాధి కల్పనే లక్ష్యం'



మాట్లాడుతున్న నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి

బుక్కపట్నం, మార్చి 12: నిరుద్యోగయువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ లక్ష్యమని అధికారి అబ్దుల్‌ఖైయూమ్, సర్పంచ్ నాగలక్ష్మీరాజు తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. 13 కంపెనీల ప్రతినిధులు హాజరై 309మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 152మంది విద్యార్థులు వివిధ కంపెనీలకు ఎంపికైయ్యారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య, డిప్యూటీ డైరెక్టర్ శివ రంగప్రసాద్, ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ మగ్బుల్‌హుస్సేన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణకుమార్, హెచ్‌ఎం జగదీష్, వివిధకంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

టార్పాలిన్ పట్టలేవీ జగనన్నా..?

ఐదేళ్లుగా సరఫరా నిల్... రైతులపై అదనపు భారం

ధర్మవరం, మార్చి 12: రైతుల సంక్షేమమే లక్ష్యమంటూ గొప్పలు చెప్పుకునే వైసీపీ ప్రభుత్వం పంట చేతికొచ్చే సమయానికి మారుతోన్న వాతావరణ పరిస్థితుల్లో ఆరుగాలం కష్టించి పండించిన ఉత్పత్తులను కాపాడుకొనేందుకు అవసరమైన టార్పాలిన్ పట్టల పంపిణీకి మంగళం పాడింది. గత టీడీపీ ప్రభుత్వం రాయితీపై టార్పాలిన్ పట్టలను అందించడంతో రైతులకు అవస్థలు తప్పేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటి పంపిణీ ఊసే మరిచింది. దీంతో తప్పని పరిస్థితుల్లో రైతులపై అదనపు భారం పడుతోంది. దాదాపు ఐదేళ్లగా కనీసంఒక్కటంటే ఒక్క పట్ట కూడా పంపిణీ చేసిన దాఖలాలు లేవు. దీంతో రైతులు పట్టలేవి జగనన్నా అంటూ ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తున్నారు. పంటకోత నూర్పిడి అనంతరం ఆరబెట్టిన ధాన్యం 17శాతం తేమవస్తేనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొంటుంది. పొలంలో కోత పూర్తయిన తరువాత ధాన్యం అరబెట్టాలంటే అనువుగా ఉండే ప్రదేశాలు కూడా లేవు. దీంతో తప్పని పరిస్థితులలో జాతీయ, రాష్ట్ర, స్థానిక రోడ్లపైనే ధాన్యం ఆరబెట్టుకోవాల్సిన పరిస్థితి. దాదాపు వారం రోజుల నుంచి 10రోజులపాటు ఎండకు అరబెట్టుకోవాలి. అదికూడా ఎండ ఎక్కువగా ఉంటేనే తేమశాతం వస్తోంది. అదే సమయంలో అకాల వర్షాలు కురిస్తే ధాన్యం తడిసిపోతోంది. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే టార్పాలిన్ పట్టలు ఎంతో ముఖ్యం. ధాన్యాన్ని కాపాడుకునేందుకు అవసరమైన టార్పాలిన్ పట్టలు కొనాలంటే మార్కెట్‌లో దాదాపు రూ.1700 నుంచి రూ. 4500 వరకు అందుబాటులో ఉన్నాయి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సీజన్ ప్రారంభంలోనే పట్టలకు ఇండెంట్ పెట్టడంతో సకాలంలో రైతులకు 50శాతం రాయితీపై పట్టలు అందేవి. అయితే ప్రస్తుతం రైతులు టార్పాలిన్ పట్టలు కావాలని వ్యవసాయశాఖ అధికారులను కోరుతున్నప్పటికీ పట్టించుకునేవారే కరువయ్యారు.



టార్పాలిన్‌పట్టలు

అదనపు భారం

సాగు ఖర్చులు పెరిగిపోతున్న నేపథ్యంలో చేతికందిన పంటను కాపాడుకునేందుకు రైతులపై అదనపు భారం పడుతోంది. కొత్తవి కొనుగోలు చేయలేక అద్దెకు తెచ్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఒక్కో పట్ట దాదాపు రూ.50 చొప్పున అద్దెకుతెచ్చుకుంటున్నామని 10 రోజులకు రూ.500 చెల్లిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరా ధాన్యం ఆరబెట్టుకునేందుకు కనీసం 8 పట్టలు అవసరమవుతాయని దీంతో దాదాపు రూ.4వేలు పట్టలకే ఖర్చవుతోందని చెబుతున్నారు. కొంతమంది రైతులు పెట్టుబడి లేక పొలాల్లోనే ధాన్యం వచ్చిన కాడికి దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. అప్పటికప్పుడే డబ్బులు ఇవ్వడమే ఇందుకు కారణమని చెబుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపాం

టార్పాలిన్ కోసం రైతులు దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే ప్రభుత్వం రాయితీ ఇస్తే వారికి టార్పాలిన్‌లను అందిస్తాం. టార్పాలిన్‌ల కోసం ఉన్నతాధికారులకు నివేదికలను పంపాం.

- సుబ్బారావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

హస్తకళలకు ప్రోత్సాహం: జేడీ

పుట్టపర్తి మార్చి 12: హస్తకళలకు ప్రత్యేక ప్రోత్సాహం కల్పిస్తామని హస్తకళల జేడీ సత్యమూర్తి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్వీజే కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ వస్తు, వస్త్ర ప్రదర్శనశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 జిల్లాల్లో 350 మంది హస్తకళ ఉత్పత్తిదారులకు గుర్తింపుకార్డులను అందచేశామన్నారు. ఇందులో నిమ్మలకుంట తోలుబొమ్మలకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందన్నారు. కదిరి శుభశ్రీ శారీ ఉత్పత్తికంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనకు స్పందన బాగుందన్నారు. పుట్టపర్తిలో శాశ్వత ప్రాతిపదికన ఈ ప్రదర్శనశాలను ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో యశోద, డిజైనర్ అశ్వనీకుమార్, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

క్వింటా వేరుశనగ రూ.6,377తో కొనుగోలు

- ఏడీఏ సత్యనారాయణ

నంబులపూలకుంట, మార్చి 12: రబీలో పండించిన వేరుశనగ క్వింటా రూ.6,377 కు కొనుగోలు చేయనున్నట్లు ఏడీఏ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ఆర్బీకే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆర్బీకే కేంద్రాలద్వారా రైతులు పండించిన నాణ్యమైన కాయలను క్వింటా రూ.6,377లతో కొనుగోలు చేయాలని సూచించారు. 2024 ఖరీఫ్‌కు సంబంధించి నూతన వంగడాలు రైతులకు అందేలా చూడాలన్నారు. నూతన వంగడాల ద్వారా అధిక దిగుబడితోపాటు, అధిక ఆదాయం కూడా వస్తుందన్నారు. 0 వడ్డీ, పంటనష్టపరిహారం విడుదల చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఏఓ లోకేశ్వర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, వాటర్ షెడ్ చైర్మన్ బయ్యారెడ్డి, ఏఈఓ శిరీషా, ఆర్బీకే సిబ్బంది ఉన్నారు.

యూనిఫాం ధరించకపోతే చర్యలు

డీపీఓ విజయ్‌కుమార్ హెచ్చరిక

తనకల్లు, మార్చి 12: సిబ్బంది యూనిఫాం ధరించకపోతే చర్యలు తప్పవని డీపీఓ విజయ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం ఆయన తనకల్లు గ్రామ పంచాయతీని, సచివాలయాన్ని తనిఖీచేశారు. రికార్డులు పరిశీలించారు. తనకల్లు గ్రామ సచివాలయంలో సిబ్బంది యూనిఫారం ధరించకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పకుండా యూనిఫా ధరించాలని ఆదేశించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. గ్రామ పంచాయతీలో ఇంటి, నీటి పన్నులు బకాయిలకు సంబంధించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పాత బకాయిలు రూ. 8లక్షలు, ఈయేడాది 11లక్షలు, మొత్తం రూ.19లక్షల బకాయి ఉందని, వెంటనే వసూలు చేయాలని ఆదేశించారు. పన్నుల విషయంలో నిర్లక్ష్యం వద్దన్నారు. ఆయనతోపాటు ఇఓఆర్‌డి ఆనందయ్య, పంచాయతీ కార్యదర్శి తుమ్మలామల దేశాయి క్రిష్ణమూర్తి రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల నిర్వహణపై శిక్షణ

పుట్టపర్తి రూరల్, మార్చి 12: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విధుల్లో పాల్గొనే తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లకు ఎన్నికల వర్క్‌షాప్‌పై ఆర్డీఓ భాగ్యరేఖ మంగళవారం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. మోడల్‌కోడ్‌ఆఫ్ ఎలక్షన్ కార్యక్రమంలో భాగంగా ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానం, అభ్యర్థుల నామినేషన్లు, సువిధయాప్, నామినేషన్ రుసుము, నామినేషన్లు ఉపసంహరణ, పరిశీలన, పోస్టల్‌బ్యాలెట్, వాహనాల అనుమతులు తదితర విషయాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో పుట్టపర్తి బుక్కపట్నం, కొత్తచెరువు, నల్లమాడ, అమడగూరు, ఓడీసీ, తహసీల్దార్లు వేణుగోపాల్, కళావతి, భారతి, నాగభూషణం, ఖాజాబి, నరసింహులు, ఈడీటీ రెహమాన్, తరుణ్‌తేజ, రాజకీయపక్షాల నాయకులు బీఎస్‌పీ రాయుడు, జనసేన బొగ్గరం శ్రీనివాసులు, సీపీఎం గంగాధర్, సీపీఐ అంజనేయులు, కాంగ్రెస్ పుట్ల గంగాధర్, టీడీపీ మాలమనోహర్, ఆమ్‌ఆద్మీ నాగరాజు, వైసీపీ శ్రీనివాసులునాయక్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

ఎకాలజీ సంస్థ కో ఆర్డినేటర్ రిజ్వానా

ధర్మవరంరూరల్, మార్చి12: ప్రస్తుత సమాజంలో మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని ఏఎఫ్ ఎకాలజీ సంస్థ కోఆర్డినేటర్ ఏఎల్‌పీ రిజ్వానా పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఏఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సాయిబాబా కళ్యాణమండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాబార్డు డీఎం అనురాధ హాజరయ్యారు. ఈ సందర్భంగా సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, చట్టాలు, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, మహిళలు స్వయం ఉపాధితో ఏవిధంగా ఆర్థికాభివృద్ధి చెందాలో వివరించారు. కార్యక్రమంలో ఎకాలజీ సంస్థ సిబ్బంది వీరభద్రరెడ్డి, అడ్వకేట్ సుమలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వైష్ణవి, లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

ధర్మవరం రూరల్, మార్చి 12: ద్విచక్రవాహనాన్ని ఓ కారు ఢీకొన్న ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందిన సంఘటన మంగళవారం మండలంలోని సీతారంపల్లి క్రాస్ 44వజాతీయరహదారి వద్ద చోటు చేసుకుందని రూరల్ పోలీసులు తెలిపారు. కనగానపల్లి మండలం చంద్రాచెర్ల గ్రామానికి చెందిన ఆదెప్ప(60), అదేగ్రామానికి చెందిన నాగభూషణ ఇద్దరు ద్విచక్రవాహనంలో మామిళ్లపల్లికి వెళుతున్నారు. సీతారంపల్లి క్రాస్ వద్దకురాగానే బెంగుళూరు నుంచి అనంతపురం వైపు వెళ్లుతున్న ఓ కారు వెనుక వైపు నుంచి ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం కిందపడి అందులో ప్రయాణిస్తున్న ఆదెప్ప అక్కడికక్కడే మృతిచెందగా నా గభూషణకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని ఆదెప్ప మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కారు బోల్తా-ఇద్దరికి గాయాలు

తనకల్లు: మండలంలోని గండోడివారిపల్లి సమీపంలో మంగళవారం రాత్రి కారు బోల్తాపడి ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. మండలంలోని కంతంపల్లికి చెందిన రమణ తన తల్లిని కొక్కంటి క్రాస్‌నుంచి కారులో గ్రామానికి తీసుకెళ్తుండగా గండోడివారి సమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న రమణ, అతడి తల్లికి గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమచికిత్స నిర్వహించారు.

కోడిపందెంరాయుళ్ల అరెస్టు

నంబులపూలకుంట: మండలంలోని మూలపల్లి గ్రామ శివారులో కోడిపందెం ఆడుతున్న పదిమందిని మంగళవారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శ్రీధర్ బాబు తెలిపారు. సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేశామని, రూ.4,600 నగదు, పదిమందిని అరెస్టుచేయగా, ఇద్దరు పారిపోయారని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లచెరువు, మార్చి 12: మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎస్‌ఐ శిరీషా తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ బుధవారం నుంచి 6వ తరగతి, ఇంటర్ మీడియట్‌కు దరఖాస్తు చేసుకోవాలని, అదేవిధంగా 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథపిల్లలు, బడిమానివేసిన, ఎస్సీఎస్టీ, మైనార్టీ, బీసీ, బీపీఎల్ బాలికలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 11న దరఖాస్తులకు చివరి తేదీ అన్నారు.

కాంగ్రెస్ టిక్కెట్ ఇస్తే పోటీ చేస్తా



మిద్ది శివారెడ్డి

పుట్టపర్తి మార్చి 12: నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తున్న తనకే పుట్టపర్తి టిక్కెట్టు ఇవ్వాలని పీసీసీ అధినేత షర్మిలను కోరినట్లు మిద్ది శివారెడ్డి అన్నారు. మంగళవారం పుట్టపర్తిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో తనకు బలమైన వర్గం, పరిచయాలు ఉన్నాయన్నారు. ఇటీవలే షర్మిలకు బయోడేటా అందజేశానన్నారు. ప్రస్తుతం ఎక్కువ మంది కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని, పార్టీకి పూర్వ వైభవం రానుందన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

పుట్టపర్తి రూరల్, మార్చి 12: మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని జిల్లాకేంద్రంలోని తారకరామనగర్‌లో ప్రజల దాహార్తిని తీర్చే ఉద్దేశంతో టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చాలన్న ఉద్దేశంతో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ధర్మవరానికి వందేభారత్ రైలు



ధర్మవరం రైల్వేస్టేషన్‌లో వందేభారత్ రైలు

ధర్మవరం, మార్చి 12: ధర్మవరం రైల్వేస్టేషన్‌కు మంగళవారం వందేభారత్ రైలు చేరుకుంది. కలబురగి నుంచి బెంగళూరుకు వెళ్తూ మార్గమధ్యంలో ధర్మవరం రైల్వేస్టేషన్‌లో ఆగింది. రైలును చూడటానికి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తరలివచ్చారు.

16న జాతీయ మెగా లోక్‌అదాలత్

ధర్మవరం, మార్చి 12: ధర్మవరం కోర్టులో ఈనెల 16న జాతీయ మెగాలోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కక్షిదారులు లోక్‌అదాలత్‌లో కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

ధర్మవరం, మార్చి 12: పౌర్ణమి సందర్భంగా ఈ నెల 25న ధర్మవరం ఆర్టీసీ డిపో నుంచి అరుణాచల గిరిప్రదర్శనతపాటు కాణిపాకానికి ప్రత్యేక బస్సు సర్వీసును ఏర్పాటుచేసినట్లు డిపోమేనేజర్ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24న ఉదయం 6గంటలకే ప్రత్యేక బస్సు బయలుదేరుతుందన్నారు. అరుణాచలానికి రానుపోను చార్జీలు రూ.1400 ఉంటుందన్నారు. దర్శనానికి వెళ్లేవారు బస్సు కౌంటర్ లోకానీ ఆన్‌లైన్‌లో కానీ సీట్లురిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 7382860947, 6300220650 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఉచిత ఎంసెట్ కోచింగ్

ధర్మవరం, మార్చి 12: అనంతపురంలోని రుద్రంపేట బైపాస్‌లోని పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో పల్లెఉమ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 25వతేదీ నుంచి మే 5వ తేదీ వరకు ఉచిత ఎంసెట్ కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని శ్రీనివాస పీజీ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ముసల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం ఎంపీసీ ఇంగ్లీషు మీడియం విద్యార్థులకు మాత్రమే శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వివరాలకు 8886630029, 8886630031 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రశాంతి నిలయంలో భద్రతా చర్యలు



తనిఖీలు నిర్వహించేందుకు వెళ్తున్న పోలీసులు

పుట్టపర్తి రూరల్, మార్చి 12: ప్రశాంతినిలయంలో మంగళవారం సాయంత్రం పోలీసులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. ప్రశాంతినిలయంలోని షాపింగ్‌కాంప్లెక్స్, క్యాంటీన్, మందిరం తదితర ప్రాంతాల్లో అర్బన్ సీఐ కొండారెడ్డి, ఎస్‌ఐ రాజేష్ పోలీసుసిబ్బందితో కలసి పరిశీలించారు. ప్రశాంతినిలయంలో దేశవిదేశాలనుంచి ఎంతోమంది భక్తులు వస్తుంటారని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు.

కంటిచూపు విషయంలో జాగ్రత్త

- డీపీఎంఓ అనూరాధ

తనకల్లు, మార్చి 12: కంటిచూపు విషయంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని డీపీఎంఓ అనూరాధ సూచించారు. మండలకేంద్రంలోని సీహెచ్‌సీ, మండల పరిధిలోని కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె గ్లకోమాపై అవగాహన కల్పించారు. సమస్య వచ్చిన వెంటనే సంబంధిత డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. ఆమెతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు లోకేశ్వర్‌రెడ్డి, ధర్మరాజు, హెల్త్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఆశావర్కర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు

ఎన్నికల ఖర్చుకు మున్సిపల్ నిధులు వద్దు: కౌన్సిలర్లు

పుట్టపర్తి మార్చి 12: ఎన్నికల నిర్వహణకు మున్సిపాలిటీ నుంచి నిధులు కేటాయిందరాదని అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు పట్టుబట్టారు. మంగళవారం సాయంత్రం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో చైర్మన్ ఓబులపతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. సాధారణ నిధుల నుంచి రూ. 20లక్షలు ఎన్నికల నిర్వహణ కోసం ఖర్చుచేసేందుకు కౌన్సిల్ అనుమతి కావాలంటూ కమిషనర్ అంజయ్య ప్రతిపాదన పెట్టారు. దీంతో కౌన్సిలర్లు సూర్యాగౌడ్, రత్నప్పచౌదరి, భాస్కర్‌రెడ్డి, సాయిగీత, తిప్పన్నలతో పాటు పలువురు కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మునిసిపాలిటీలో తాగునీరు సౌకర్యం, పారిశుధ్యానికే నిధులు సరిపడక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఎన్నికల ఖర్చుల కోసమని నిధులు ఎలా కేటాయిస్తారంటూ వారు ప్రశ్నించారు. ప్రతిపాదనలను ఎట్టిపరిస్థితుల్లో అనుమతించేది లేదన్నారు. విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో ఇంజనీరు స్వాతిని సరెండర్ చేయాలన్న విషయంపై టీడీపీ కౌన్సిలర్ రత్నప్ప అభ్యంతరం వ్యక్తం చేశారు. పనిచేయనివారిని ఎలా పెట్టుకుంటామని, తాగునీటి పర్యవేక్షణ ఏమాత్రం సరిగాలేదని అధికార పక్ష సభ్యులు అన్నారు. పనిచేసే వారిని నియమించాలంటూ కమిషనర్‌కు సూచించారు. వేసవిలో తాగునీటి కొరత రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా వడ్నమ్మ దేవి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వడ్నమ్మ దేవత

అగళి, మార్చి 12 : మండలంలోని నరసంబుది గ్రామం పొలంలో వెలసిన వడ్నమ్మ దేవి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి యేడాది ఈ ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీ. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వడ్నమ్మదేవి ఉత్సవాలకు తరలివస్తారు. మహిళలు భక్తిశ్రద్ధలతో హారతులు మోసి మొక్కులు తీర్చుకుంటారు. భక్తులకు స్థానికులు తీర్థ ప్రసాద వినియోగం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

తుమ్మల మారెమ్మకు ప్రత్యేక పూజలు



అలంకరణలో తుమ్మల మారెమ్మ

గుడిబండ: మండల కేంద్రంలోని తుమ్మల మారెమ్మ ఆలయంలో భక్తులు అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేషంగా అలంకరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనేక మంది భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

బాబయ్య దర్గాలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా

పెనుకొండ, మార్చి 12: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపావాస దీక్షలు పాటిస్తున్న ముస్లింలకు స్థానిక బాబయ్య స్వామి దర్గా ఆవరణంలో భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. దర్గా వంశపారంపర్య పీఠాధిపతి తాజ్ బాబా ఆధ్వర్యంలో ఈ వసతి కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు మంగళవారం రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉపవాసం ఉన్న 500మంది భక్తులకు అన్నదానం చేసినట్లు తాజ్‌బాబా తెలిపారు. ప్రతిరోజూ ఉపవాసం ఉన్న 500 మందికిపైగా ముస్లింలకు సెహరీ, ఇఫ్తార్ అన్నదాన కార్యక్రమాన్ని 30రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉపవాస దీక్షలో ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అల్లా కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

పెనుకొండ టౌన్(సోమందేపల్లి), మార్చి 12: ఆర్థిక ఇబ్బందులతో సోమందేపల్లి మండలం ముద్దపుకుంట గ్రామానికి చెందిన శివ(30) సోమవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ విజయ్ కుమార్ అందించిన వివరాల మేరకు... శివకు ఏడేళ్ల కిందట జ్యోతి అనే యువతిని వివాహం చేసుకున్నాడు. వారికి ఇప్పటివరకు పిల్లలు కాలేదు. వారు అదే గ్రామంలో శివ తండ్రి మల్లయ్యతో పాటు నివాసముంటున్నారు. శివ వ్యవసాయంలో తండ్రికి చేదోడుగా ఉండేవాడు. అయితే వ్యక్తిగతంగా ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పెనుకొండ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నివాళులర్పించిన బీకే, సవిత

ముద్దపుకుంటలో ఆత్మహత్య చేసుకున్న శివ కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి సవిత అన్నారు. వారు మంగళవారం పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ఆసుపత్రిలో ఉన్న శివ మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే పెనుకొండ మండలం చంద్రగిరి గ్రామానికి చెందిన ఎల్లారెడ్డి మంగళవారం పాముకాటుకు గురై పెనుకొండ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబాన్ని జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, నాయకులు కేశవయ్య పరామర్శించారు.

రైలు కిందపడి యువకుడు...

పెనుకొండ రూరల్, మార్చి 12: మండలంలోని కొండాపురం సమీపంలో బెంగళూరుకు వెళ్లే రైలు మార్గంలో రైలుకింద పడి సురేష్(30)అనే యువకుడు మృతి చెందాడు. రైల్వే ఎస్‌ఐ బాలాజీ తెలిపిన మేరకు... పెనుకొండ సమీపంలోని కొండాపురం సమీపంలో ఓ వ్యక్తి రైలు కింద పడి ఉన్నట్లు కీమెన్ రైల్వే పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో రైల్వే ఎస్‌ఐ సిబ్బందితో ఘటనా స్థలంకు వెళ్లి పరిశీలించారు. అతడి వద్ద ఉన్న ఆధార్‌కార్డు ప్రకారం గుంటూరు జిల్లా నర్సారావుపేటకు చెందినవాడని తెలిసింది. అతడు కియ కార్ల పరిశ్రమలో పనిచేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పెనుకొండ ఆసుపత్రికి తరలించి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందిద్దాం

●మనపై పెట్టిన కేసులు మన పనితనానికి అవార్డులు

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత



ఐక్యత చాటుతున్న నాయకులు

పెనుకొండ టౌన్, మార్చి 12 : అధికార పార్టీ వైసీపీ ఐదేళ్ల పాటు రాష్ట్రంలో కక్షలతో అరాచక పాలన సాగించిందని, దానిని అంతం చేసేందుకు కంకణకట్టుకుందామని టీడీపీ స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పిలుపునిచ్చారు. నియోజకవర్గ నాయకులు, మండల నాయకులపై అక్రమ కేసులు పెట్టారన్నారు. ఈ అక్రమ కేసులు మనపై పెట్టిన కేసులన్నీ మన పనితనానికి అవార్డుల్లాంటివన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమందేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన 30 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వారికి సవిత కండువా లు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సవిత మాట్లాడుతూ... నియోజకవర్గ ప్రజలంతా తనకు అండగా ఉంటారన్న నమ్మకంతో టీడీపీ అధినేత చంద్రబా బు నాయుడు కురుబ సామాజిక వర్గానికి చెందిన తనను టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గా ప్రకటించారన్నారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. కార్యకర్తల నుంచి టీడీపీ జాతీయ అధ్యక్షుడి వరకు కేసులు పెట్టిన పార్టీ వైసీపీ అని మండిపడ్డారు. ఈ వైసీపీ పాలనలో ఐదేళ్లు కష్టపడ్డామని ఇప్పుడు మంచి రోజులు రానున్నాయని అన్నారు. ఇప్పుడొచ్చిన అవకాశంతో దాచుకుని, దోచుకునే నాయకులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వెంకటరమణ, టీడీపీ మండల మాజీ కన్వీనర్ శ్రీరాములు, నాయకులు త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండలస్థాయి సమావేశం: కుల మతాలకు అతీతంగా ప్రజల సేవ కోసం అహర్నిశలు కృషిచేసే వ్యక్తి పెనుకొండ నియోజకవర్గ అభ్యర్థి సవిత అని నియోజకవర్గ పరిశీలకుడు నరసింహరావు పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం సవిత ఆధ్వర్యంలో పార్టీ మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహరావు మాట్లాడుతూ... రాష్ట్రంలో ఏ అభివృద్ధి జరగాలన్నా అది టీడీపీతోనే సాధ్యమన్నారు. అధికార పార్టీ సంక్షేమ పథకాల పేరుతో ప్రజల్ని దోపిడీ చేసి వాటిని పంచుతోందని, అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. సంక్షేమం అంటే టీడీపీ అని కొనియాడారు. అలాగే పెనుకొండ మండలం మునిమడుగు నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేయాలని కోరారు. టీడీపీ మునిమడుగు సీనియర్ నాయకుడు చిన్నవెంకటరాముడు, రఘువీర చౌదరి, రామలింగ, మైనార్టీ నాయకుడు జఫ్రుల్లా, జనసేన నాయకుడు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పురానికి వసుంధరాదేవి

ఎమ్మెల్యే సొంత నిధులతో ఏర్పాటు చేసిన ప్లాంట్ల ప్రారంభం

హిందూపురం/ చిలమత్తూరు, మార్చి 12 : స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధరదేవి బుధవారం హిందూపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఆమె ఉదయం చిలమత్తూరు మండలం కోడూరులోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో, మొరంపల్లిలో సుమారు రూ.20 లక్షలతో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్లను ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం లేపాక్షి మండలం టీడీపీ నాయకుడి ఇంట్లో శుభ కార్యక్రమానికి హాజరుకానున్నారు. మధ్యాహ్నం 3గంటలకు హిందూపురంలోని 37వ వార్డులో ఉన్న దండురోడ్డులో సీసీ రోడ్డు డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ, 4గంటలకు పోచనపల్లిలో వాటర్‌ప్లాంట్లు ప్రారంభించనున్నారు. వీటన్నింటికి ఎమ్మెల్యే సొంత నిధులు ఖర్చుచేసినట్లు ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర తెలిపారు.

42 మంది రక్తదానం

గోరంట్ల, మార్చి 12: పట్టణంలోని ఎస్‌పీవీఎం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 42మంది మంగళవారం రక్తదానం చేశారు. చిక్‌బళ్లాపూర్‌కు చెందిన రెడ్‌క్రాస్ సొసైటీ అధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్‌పీవీఎం, ఎస్కేడీఆర్ జూనియర్ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ వారి సహకారంతో పలువురు రక్తదానం చేశారు. డిగ్రీ కళాశాల సిబ్బంది, విద్యార్థులు, వివిధ కళాశాలల వారు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు మొత్తం 42 మంది రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ భక్తవత్సలం, అరవింద్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు ఆజాద్, రఘునాథ్‌రెడ్డి, బాలమోహన్, రామచంద్ర, వెంకటేష్, ఉపాధ్యాయులు గోపాల్, అశోక్, మోహన్‌రెడ్డి, గంగాధర్, రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి రవికుమార్, సత్యసాయి కోఆర్డినేటర్, రమేష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం: సీడీపీఓ

రొద్దం, మార్చి 12: గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతలక్ష్మి పేర్కొన్నారు. మండల పరిధిలోని కుర్లపల్లి, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం పౌష్టికాహారంపై అంగన్‌వాడీ లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. చిరుధాన్యాల ఆవశ్యకత, బాల్యవివాహాలపై వివరించారు. పౌష్టికాహార కిట్‌లను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనూరాధ, కార్యకర్తలు సౌభాగ్య, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

'ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపండి'

మడకశిర రూరల్, మార్చి 12: విద్యార్థుల ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి పేర్కొన్నారు. మండలంలోని గౌడనహళ్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకోసం ఆరోగ్యశిబిరం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ... ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నాయని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల కు వైద్య పరీక్షలు నిర్వహించారు. కల్లుమర్రి పీహెచ్‌సీ డాక్టర్లు మాధుర్య, వినోద్‌కుమార్, సూపర్‌వైజర్ రాంప్రసాద్ ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల తనిఖీ

అగళి, మార్చి 12 : మండలంలోని పీ బ్యాడిగెర చెక్‌పోస్టును తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. త్వరలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యం లో చెక్‌పోస్టుల ద్వారా అక్రమ రవాణా జరగకుండా, మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ కుండా గట్టి చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. మండలం కర్ణాటక సరిహద్దులో ఉండటంతో కఠిన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు

ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్



కిట్లను బూత్ కన్వీనర్లకు అందజేస్తున్న సునీల్‌కుమార్

మడకశిరటౌన్, మార్చి 12: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం, ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. అప్పుడే రాష్ట్రానికి భవిష్యత్తు అన్నారు. పట్టణంలోని మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయం సమీ పంలో ఉన్న కమ్యూనిటీ భవనంలో మంగళవారం టీడీపీ బూత్ కన్వీనర్లతో బా బు ష్యూరిటీ భవిషత్తుకు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాల కిట్లను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి గా బాధ్యతలు స్వీకరించిన తక్షణమే సూపర్ సిక్స్ పథకాలను, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ తదితర కార్యక్రమాలను అమలు చేస్తారని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఆవశ్యకతను వివరించాలన్నారు. ఈపథకాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించాలని, బూత్ కన్వీనర్లకు, నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

రోడ్డుపై గుంత పూడ్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గుంత పూడ్చివేశాక ఇలా..

గోరంట్ల, మార్చి 12: పట్టణంలోని బస్టాండ్ కూడలిలో నడిరోడ్డుపై ఏర్పడి న గుంతను పంచాయతీ కార్యనిర్వా హణాధికారి బాబురావు మంగళవారం మరమ్మతులు చేపట్టి, పై భాగంలో పూడ్చి వేయించారు. గోరంట్లలోని బ స్టాండ్ కూడలిలో మార్కె ట్‌కు వెళ్లే రహదారిపై మురుగునీటి కాలువకు ఏర్పాటు చేసి రంధ్రానికి అమర్చిన ఐరన్ చాంబర్ ప్లేటు భారీ వాహనాలు వెళ్లడంతో పూర్తిగా దెబ్బతింది. రహదారిపై వంకర్లు తిరిగి పైకి లేవ డంతో, ప్రమాదకర పరస్థితి ఏర్పడింది. ఈ విషయంపై నడ్డిరోడ్డుపై గుంత అనే వార్తను ఆంధ్రజ్యోతి సోమవారం వెలుగులోకి తెచ్చింది. మేజర్ పంచాయతీ అధి కారులు వెంటనే స్పందించారు. సోమవారం కాయకూరల వారపు సంత ఉండ డంతో రద్దీగా ఉండే రహదారిలో మరమ్మత్తు పనులు చేపట్టలేకపోయారు. పంచాయతీ మేస్త్రీ గణేష్ వర్కర్లతో మంగళవారం మరమ్మతులు చేశారు. రోడ్డు వేసినప్పటినుంచి మురుగునీటి చాంబర్‌ను ఉపయోగించే అవసరం లేకపోవడంతో, ఆ కాంక్రీటు చాంబర్‌ను తొలగించి కాలువపై బండలు పరిచారు. దానిపై సిమెంటు, కాంక్రీట్ రోడ్డు వేశారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలుండాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు సూచన



కంబాలపల్లిలో పోలింగ్ కేంద్రంపై ఆరాతీస్తున్న కలెక్టర్

హిందూపురం అర్బన్, మార్చి 12: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉండే లా చూడాలని జిల్లా కలెక్టర్ అరుణబాబు స్థానిక అధికారులకు సూచించారు. హిందూపురం మండల పరిధిలోని మణేసముద్రం పాఠశాలలో, పట్టణ పరిధి లోని ఒకటో వార్డుల్లో ఏర్పాటు చేసి పోలింగ్ కేంద్రాల్లో ఆయన మంగళవారం అకస్మిక తనిఖీలు చేపట్టారు. పోలింగ్‌కేంద్రాల్లో లైట్లు, ఫ్యాన్లు, గాలి, వెలుతురు తదితర వాటి గురించి స్థానిక అధికారులతో ఆరాతీశారు. మణేసముద్రం జిల్లాపరిషత్ పాఠశాల ఒకటో పోలింగ్‌బూత్, కొట్నూరు జిల్లాపరిషత్ పాఠశాల 17,18 పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఆయన వెంట పెనుకొండ సబ్ కలె క్టర్ అపూర్వ భరత్, డీఎస్పీ కన్వక్షన్, మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, తహసీ ల్దార్ శివప్రసాద్‌రెడ్డి, బీఎల్‌ఓలు, పాఠశాల హెచ్‌ఎం తదితరులు ఉన్నారు.

రొద్దం : మండలంలోని కంబాలపల్లి ఎంపీయూపీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ తనిఖీ చేపట్టారు. పోలింగ్ కేంద్రంలో సదుపాయాలను ఆరాతీశారు. అదేవిధంగా పెద్దమంతూరు, రెడ్డిపల్లి, దొడగట్ట గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను సబ్‌కలెక్టర్, డీఎస్పీ బాజీ జాన్ సైదా పరిశీలించారు. వారి వెంట రెవెన్యూ రీసర్వే డీటీ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ ఖాజామొయినుద్దీన్, ఎంఈఓ-2 జయభాస్కర్, వీఆర్‌ఓ రాము, గోపి, నాగరాజు తదితరులున్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం తనిఖీ

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్‌తో మాట్లాడుతూ... పరీక్షల నిర్వహణ, విద్యార్థుల హాజరుపై ఆరాతీశారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు346మందికిగాను 23మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్‌ఐఓ సురేష్‌బాబు, పీఈసీ మెంబర్ చెన్నకేశవరెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ ఉన్నారు.

రూ.10కోట్ల అంచనాతో బడ్జెట్ ప్రతిపాదన

కౌన్సిల్ సమావేశంలో ప్రవేశపెట్టిన కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

పెనుకొండ, మార్చి 12 : నగర పంచాయతీకి సంబంధించి 2024-25సంవత్సరానికిగాను రూ. 10,13,38,950 నిధుల అంచనాతో కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్ ను ప్రతిపాదించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవా రం ఛైర్మన్ ఉమర్‌ఫారూక్ అధ్యక్షతన అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా రూ.10కోట్ల నిధులతో అంచనా బడ్జెట్‌ను సమావేశంలో ప్రతిపాదించారు. ప్రారంభ నిలువ రూ.8,98,17,550 కాగా సాధారణ రాబడి రూ.3.41 కోట్లు, మూలధనం రాబడులు రూ.10,75,10,000. ఈ మేరకు మొత్తం రాబడులు రూ.23,14,28,550. సాధారణ ఖర్చు రూ.3,10,84,000 కాగా మూలధన ఖర్చులు రూ.9,90,05,600, మొత్తం ఖర్చులు రూ.13,00,89,600. మొత్తం మిగులు 10,13,38,900తో అంచనా బడ్జెట్‌ను ప్రతిపాదించారు. దీనికి సభ ఆమోదం తెలిపింది. అనంతరం సభ్యుడు రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ... పట్టణంలో తాగునీటి సమస్య తీవ్ర ఇబ్బందికరంగా మారిందన్నారు. వేసవి కాలం ప్రారంభం కావడంతో పట్టణంలో మంచినీటి కొరత తీవ్రంగా ఉందన్నారు. అలాగే రోడ్లకు ఇరువైపులా పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి బంకులు ఏర్పాటు చేయడంతో రోడ్లు కుంచించుకు పోయాయన్నారు. వీటికితోడు ద్విచక్రవాహనాలను రోడ్లపైనే ఎక్కడికక్కడ నిలుపుతుండడంతో వాహనాల రాకపోకలతో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. అందుకు కమిషనర్ వంశీకృష్ణ సమాధానం ఇస్తూ పోలీసుల సహకారంతో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. వేసవికాలం కావడంతో బోర్లలో నీటి మట్టం తగ్గిపోతున్నాయని తెలిపారు. పరిస్థితిని గుర్తించి ప్రజలు నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. సమావేశంలో వైస్ ఛైర్మన్‌లు సునీల్‌కుమార్, నందినిరెడ్డి, కౌన్సిలర్లు రామాంజనేయులు, భాస్కర్‌నాయక్, మేనేజర్ నరసింహులు, ఆర్‌ఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నిలబెట్టుకున్నాననన్న జగన్ మాట పచ్చి అబద్ధం : బీకే

పెనుకొండ, మార్చి 12: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాను ఇచ్చిన హామీలు నిలబెట్టుకున్నానని మేదరమెట్లలో చేసిన ప్రకటనలు పచ్చి అబద్ధాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసాధి విమర్శించారు. ఆయన మంగళవా రం ఓ ప్రకటన విడుదల చేశారు. జగన్ ఇచ్చిన హామీల్లో 85శాతం అమలు చేయకుండా మాటతప్పి ప్రజలను మోసగించాడన్నారు. సంక్షేమానికి జగన్ 15శాతం మాత్రమే ఖర్చుచేయగా చంద్రబాబు 19శాతం ఖర్చుచేశారన్నారు. బాబాయిపై గొడ్డలివేటు పాపంతో పులివెందులలో ఎలా గెలుస్తాడో చూస్తామన్నారు. రూ.10లక్షల కోట్లు దోపిడీ, జిల్లాకో సొంత ప్యాలెస్ నిర్మాణం జగన్ కలలన్నారు. ప్రజా విశ్వాసం కోల్పోయినందుకే సభకు లక్ష మంది కూడా రాలేదన్నారు. తన మోసాన్ని టీడీపీకి అంటగట్టి, చెప్పిన అబద్ధమే వందసార్లు చెప్పడం జగన్ నైజమన్నారు. మద్య నిషేధం చేశాకే ఓటు అడుగుతానని చెప్పిన జగన్ మాట తప్పి మడమతిప్పాడన్నారు. ప్రజలను ఓటు అడిగే హక్కు కోల్పోయాడన్నారు. నాశిరకం మద్యంతో 35లక్షల మంది ఆరోగ్యాన్ని నాశనం చేశాడన్నారు. దాదాపు 30వేల మంది ప్రాణాలు కోల్పోయి, వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. అధికారంలోకి రాగానే మూడు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీచేస్తానని, సీపీఎస్ రద్దుచేస్తానని, అంగన్‌వాడీలకు తెలంగాణకన్నా అదనంగా రూ.వెయ్యి పెంచుతానని చెప్పి మాట తప్పాడన్నారు. అలాగే విద్యుత్ చార్జీలు పెంచి, ఉచిత ఇసుక రద్దుచేసి రూ.50వేల కోట్ల కుంభకోణం చేశాడన్నారు. ఇలా 85శాతం హామీలు అమలు చేయకుండా మాట తప్పిన ఘనుడు జగన్‌రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం 99శాతం హామీలు అమలు చేశామని చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. ప్రజలను మోసం చేయడానికి, మాయ చేయడానికి మేదరమెట్లకు ఆరు జిల్లాల్లోని 50నియోజకవర్గాల నుంచి జనాన్ని తరలించే ప్రయత్నం చేశాడన్నారు. ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాల ద్వారా వందల కోట్లు ఖర్చుపెట్టి జనాన్ని తరలించే ప్రయత్నం చేసినా సభ వెలవెలబోయిందన్నారు. అందుకే మీడియాపై ఆంక్షలు పెట్టాడన్నారు. జగన్‌ఎన్ని కుయుక్తులు పన్నినా రాబోయే ఎన్నికల్లో టీడీపీదే విజయమని బీకే ధీమా వ్యక్తం చేశారు.

సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ ప్రచారం



తాడంగిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

రొద్దం, మార్చి 12 : టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుందని టీడీపీ నాయకులు తెలిపారు. వారు మంగళవారం మండలంలోని తాడంగిపల్లి, మోపర్లపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ చేపట్టబోయే పథకాలపై వివరించారు. ప్రతి ఇంటికి యేడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లు, మహి ళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి మహిళకు నెలకు రూ. 1500 నగదు ఇస్తారన్నారు. రైతుకు రూ.20వేలు పెట్టుబడి నిధి, తల్లికి వందనం పేరుతో ప్రతి విద్యార్థికి రూ.15 వేలు నగదు తదితర పథకాలను అమలు చేస్తుందన్నారు. రెండు నెలల్లో టీడీపీ ప్రభుత్వం వస్తుందని ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని కోరారు. వైసీపీ ప్రభుత్వ ఆగడాలను ప్రజలకు వివరిస్తూ టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. టీడీపీ నాయకులు మాధవనాయుడు, చంద్రమౌళి, వెంకటరామిరెడ్డి, నరసింహులు, లింగప్ప, చెన్నకేశవులు, రామక్రిష్ణ, తిరుపాల్‌నాయుడు, మాజీ సర్పంచ్ రంగన్న, అరుణ్‌కుమార్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఆవిర్భావ వేడుకల సందడేదీ?

చిలమత్తూరు, మార్చి 12: వైసీపీలో వర్గపోరు రోజురోజుకు పెరుగుతూనే ఉంది. మండలంలో నాయకులు రెండు మూడు వర్గాలుగా జతకట్టి ముందుకు సాగుతున్నారు. ఈ వర్గపోరులో భాగంగా మంగళవారం ఆ పార్టీ ఆవిర్భావ వేడుకలను సైతం ఎవ్వరూ పట్టించుకోలేదు. దాంతో పార్టీలోని విభేదాలు మరోసారి బయటపడ్డాయి. మండలంలో అధికార పార్టీలోని ఓ ప్రజాప్రతినిధికి, పార్టీ మండల నాయకులకు మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా జరుపుకునే పార్టీ ఆవిర్భావ వేడుకలకు ఈ ఏడాది స్వస్తి పలికినట్లు సమాచారం. దీనిపై ఆ పార్టీలో తీవ్ర చర్చ జరుగుతోంది.

పేకాడుతున్న 11 మంది అరెస్ట్

రూ. 1.51 లక్షలు నగదు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం

చిలమత్తూరు, మార్చి 12: మండలంలోని గాడ్రాళ్లపల్లి శివార్లలో పేకట స్థావరాలపై దాడులు నిర్వహించి పేకాడుతున్న 11 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు. గాడ్రాళ్లపల్లి పరిసరాల్లో పేకాడుతున్నట్లు సమాచారం మంగళవారం మధ్యాహ్నం రావడంతో తాను సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో 11 మంది దొరికారన్నారు. వారి నుంచి రూ.1.51 లక్షల నగదు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశామన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకొని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు. కొడికొండ చెక్‌పోస్టులో మంగళవారం వాహనాల తనిఖీ చేస్తుండగా.. బూదిలి గ్రామానికి చెందిన వ్యక్తి తన ద్విచక్రవాహనంలో కర్ణాటక మద్యం తీసుకువస్తూ పట్టుబడ్డాడన్నారు. అతడి నుంచి 48 ప్యాకెట్ల మద్యం, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశామని తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

రేపు కాంగ్రెస్ పార్టీ ప్రతినిధుల సభ

మడకశిర టౌన్, మార్చి 12: పట్టణంలోని అమరాపురం బస్టాండు ఆవరణంలో గురువారం ఉదయం 10 గంటలకు కాంగ్రెస్ పార్టీ ప్రతినిధుల సభ నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కే సుధాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిరెడ్డిపాళ్యంలో గురువారం ఉదయం 9 గంటలకు సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీమంత్రి రఘువీరారెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. అక్కడి నుంచి పాదయాత్రగా అమరాపురం బస్టాండుచేరుకుంటామన్నారు. కావున నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు కేడీపీ త్రైమాసిక సభ

పావగడ, మార్చి 12: తాలూకా పంచాయతీ కార్యాలయంలో త్రైమాసిక సభను ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్నట్లు ఈఓ జానకిరాం తెలియజేశారు. డిసెంబరు నెలలో జరిగిన కేడీపీ సభకు సంబంధించి వివరాలతో తాలూకా స్థాయి అధికారులు ఉదయం 11 గంటలకు హాజరుకావాలని ఆయన తెలియజేశారు.

మోదీ మళ్లీ ప్రధాని కావాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ జనార్దనస్వామి

పావగడ, మార్చి 12: దేశ సమగ్ర అభివృద్ధి, భద్రత కోసం నరేంద్రమోదీ మూడోసారి ముచ్చటగా ప్రధానమంత్రి కావాలని చిత్రదుర్గం మాజీ ఎంపీ ఏ జనార్దనస్వామి పేర్కొన్నారు. ఆయన మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒకప్పుడు దేశం అంటే అన్ని రంగాల్లో వెనుకబడి ఉండేదని, మోదీ 2014లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రపంచ దేశాలే దేశం వైపు తిరిగి చూసేలా చేశారని అన్నారు. కొన్ని బ్యాంకులు, ఫ్యాక్టరీలన ప్రైవేటీకరణ చేసినప్పటికీ ఉద్యోగ భద్రత కల్పించడంలో మోదీ ఎంతో శ్రమించారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మోదీ విలువ మరింత పెరిగిందని వివరించారు. ఎగువ భద్రా నీటిని పావగడకు తరలించడంలో పావగడ, చళ్లకెరె, ములకాలమూడు తాలూకాలో ప్రణాళికలో లేనప్పటికీ తన వాటిని చేర్పించానన్నారు. వాటికి నీరందించేందుకు కృషి చేశానని తెలిపారు. తను చేసిన అభివృద్ధి, సేవలను గుర్తించి చిత్రదుర్గం ఎంపీ టిక్కెట్ కేటాయిస్తే తాను ఎన్నికల బరిలో దిగుతానని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పురుషోత్తంరెడ్డి, రాజేష్ తదితరులు హాజరయ్యారు.